aruhi
aruhi group
MAHAA PRABHA NEWS
Delivering truth with integrity – the voice of the people.
Email : info@mahaaprabha.com
www.mahaaprabha.com - 9160600610
VINTAARA INSTITUTE OF TECHNOLOGY
Build Your Dream Career
ADMISSION OPEN
HYDERABAD & VIJAYAWADA & VISAKHAPATNAM & GUNTUR

నమస్తే
# మహాప్రభ
ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ
ఆదివారం
03-05-2026 సంపుటి : 01 సంచిక : 42 పేజీలు : 08 వెల : ₹ 5/-
తెలుగు దినపత్రిక

BESQATI
besqati.com
Contact : info@besqati.com

Published From RANGAREDDY,TELANGANA.తెలంగాణ mahaaprabha.com NAMASTEY MAHAAPRABHA RNI NO : TGTEL/26/A0738 info@mahaaprabha.com



## రీపోలింగ్ లోనూ భారీగా ఓటింగ్

- బారులు తీరి ఓటేసిన జనం
- 90శాతం పోలింగ్ నమోదు

కోల్‌కతా, -02మే (మహాప్రభ )
పశ్చిమబెంగాల్ సౌత్ 24 పరగణాల జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన 15 బూత్‌లలో శనివారంనాడు రీపోలింగ్ ముగిసింది. మగ్రహాట్ పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గం లోని 11 పోలింగ్ స్టేషన్లు, డైమండ్ హార్బర్‌లోని 4 పోలింగ్ స్టేషన్లలో ఉదయం 7 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 6 గంటలతో ముగిసింది. 90 శాతం పోలింగ్ నమోదైనట్టు అధికార వర్గాలు తెలిపాయి. కాగా, ఉదయం 11 గంటల -మిగతా 3 లో

## పాంచజన్యంతో.. వస్తున్నాం

### ఉచిత విద్య, వైద్యం, ఉద్యోగాలు మా టార్గెట్

- అన్ని వర్గాల ప్రజల సంక్షేమం లక్ష్యంగా పోరాటం
- ప్రతి అంశంపైనా స్పష్టమైన విధానంతో సాగుతాం
- రేవంత్‌ను ఇంటికి సాగనంపడమే ప్రథమ లక్ష్యం
- టీఆర్ఎస్ అధ్యక్షురాలు కవిత

**ఉద్యమకారులకు లక్ష ఉద్యోగాలు ఇస్తాం**



హైదరాబాద్, -02మే (మహాప్రభ )
తెలంగాణ రక్షణసేన ఐదు అంశాలను ప్రధాన అజెండాగా తీసుకుందని కల్వకుంట్ల కవిత అన్నారు. పాంచజన్యం పూరించామని, ఇక విజయపథంలోకి దూసుకు పోతామని అన్నారు. సర్వోదయ తెలంగాణ లక్ష్యంగా పోరాటం చేస్తామని అన్నారు. ఎంత పెద్ద ఆరోగ్య సమస్య వచ్చినా.. పేదలకు ఉచితంగా వైద్యం అందిస్తామన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో కవిత మాట్లాడారు. పేదలకు నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం అందాలన్నదే తమ లక్ష్యం అన్నారు. -మిగతా 3 లో

## ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు

- ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్‌సేఫ్టీ బ్యూరోతో దిశానిర్దేశం
- నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ డీసీపీలతో డీజీపీ ఆనంద్ సమావేశం



హైదరాబాద్, -02మే (మహాప్రభ )
రాష్ట్రంలో పెరుగుతున్న ట్రాఫిక్ ఇబ్బందులను నియంత్రించడానికి ఆ విభాగం ఉన్నతాధికారులు సమన్వయంతో పని చేయాలనీ, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించినవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర నూతన డీజీపీ సి.వి ఆనంద్ ఆదేశాలు జారీ చేశారు. శనివారం హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, ఫ్యూచర్‌సిటీలకు చెందిన ట్రాఫిక్ డీసీపీలతో డీజీపీ కీలక సమావేశం నిర్వహించారు. ఔటర్‌రింగ్‌రోడ్డుపై పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు -మిగతా 3 లో



## బంగాల్‌లో కౌంటింగ్ కు రెడీ

- ఓట్ల లెక్కింపు కోసం సర్వం సిద్ధం
- అడిషనల్ కౌంటింగ్, పోలీస్ అబ్జర్వర్ల నియామకం
- బంగాల్ లో 77 మంది పోలీసు అబ్జర్వర్లు
- పారదర్శకంగా బంగాల్ ఓట్ల లెక్కింపు జరపడం కోసమేనన్న ఈసీ


కోల్‌కతా : -02మే (మహాప్రభ )
బంగాల్ లో మే 4న ఓట్ల లెక్కింపు జరగనున్న నేపథ్యంలో ఎలక్షన్ కమిషన్ కీలక చర్యలు చేపట్టింది. బంగాల్ లో ఉన్న కౌంటింగ్ కేంద్రాల వద్ద భద్రతను మరింత బలోపేతం చేసేందుకు, శాంతి భద్రతల ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు 165 మంది అదనపు కౌంటింగ్ అబ్జర్వర్లను, 77 మంది పోలీసు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ శనివారం తెలిపింది. ఓట్ల లెక్కింపు పారదర్శకంగా జరిగేలా చూడడమే లక్ష్యంగా ఈ అదనపు అబ్జర్వర్లను నియమించినట్లు ఈసీ స్పష్టం చేసింది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజాస్వామ్య ప్రాతినిధ్య చట్టం 1951లోని సెక్షన్ 20బీ కింద తమకు సంక్రమించిన అధికారాలను
-మిగతా 3 లో

## నైరుతి వచ్చేస్తోంది!

### ఈ నెలలోనే రుతుపవనాల పలకరింత

- 14 నుంచి 16 తేదీల మధ్యలోనే అండమాన్ నికోబార్‌కు రాక
- నెలాఖరులో ఇబ్బడిముబ్బడిగా వానలు
- ఇక మేలో పగటి పూటే కాదు, రాత్రిపూట ఉష్ణోగ్రతలు ఎక్కువే
- రాజస్థాన్, గుజరాత్ వంటి ప్రాంతాల్లో తీవ్ర వడగాల్పులు

న్యూఢిల్లీ, -02మే (మహాప్రభ )
వేసవి భానుడి భగభగలతో అల్లాడుతున్న ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ముందే పలకరించే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది. సాధారణంగా మే నెల చివరి -మిగతా 3 లో





## మేమున్నాం.. ఆదుకుంటాం

### ఓఆర్ఆర్ ప్రమాద కుటుంబాలకు కేటీఆర్ భరోసా

- రోడ్డు ప్రమాదంలో ఆరుగురు సిరిసిల్ల వాసులు మృతి
- ఉస్మానియా హాస్పిటల్ కు వెళ్లిన కేటీఆర్
- మృతదేహాలకు నివాళి.. బాధిత కుటుంబానికి పరామర్శ

హైదరాబాద్, -02మే (మహాప్రభ )
హైదరాబాద్ లోని శంషాబాద్ వద్ద ఓఆర్ఆర్ పై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఆరుగురు సిరిసిల్ల వాసుల పార్థివ దేహాలకు శనివారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళు లర్పించారు. ఉస్మానియా జనరల్ హాస్పిటల్ మార్చురీ వద్ద బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. వారికి ధైర్యం చెప్పి అన్ని విధాలుగా అండగా -మిగతా 3 లో

## ఉద్యోగుల డిమాండ్లకు సీఎం ఓకే

### నాలుగు అంశాలపై ఉద్యోగ సంఘాలకు స్పష్టతనిచ్చిన రేవంత్ రెడ్డి


- పీఆర్సీపై తక్షణమే రిపోర్టు అందించాలని అధికారుల కమిటీకి ఆదేశం
- రిపోర్టు ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటామని భరోసా
- జూన్ 1 లోగా ఆరోగ్య భద్రత కార్డులను ఉద్యోగులకు అందిస్తామని హామీ
- గుర్తింపు సంఘాలు తరుచూ భేటీ అయి సమస్యలపై సర్కారుకు తెలపాలి
- ఇది ఫ్రెండ్లీ ప్రభుత్వం... మీ సమస్యలను పరిష్కరించే బాధ్యత మాదని భరోసా
- సీఎం ఇచ్చిన హామీతో హర్షం వ్యక్తం చేసిన ఉద్యోగులు

**వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కోసం రూ. 6 వేల కోట్లు చెల్లిస్తాం**

హైదరాబాద్,-02మే (మహాప్రభ )
తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై కీలక ముందడుగు పడింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సమావేశమై వారి సమస్యలు, డిమాండ్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఉద్యోగ సంఘాల జేఏసీ, ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ నేతలతో జరిగిన ఈ సమావేశంలో పలు కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నేతలు తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా శాసన మండలిలో పనిచేస్తున్న 13,100 మంది సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడం చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. అలాగే చాలా కాలంగా పెండింగ్‌లో -మిగతా 3 లో








## నెట్‌వర్క్ లేకపోయినా ఎమర్జెన్సీ అలర్ట్

- స్మార్ట్ ఫోన్లకు వచ్చిన మెసేజ్ లక్ష్యం ఇదే
- కమ్యూనికేషన్ కోసం భారత్ సొంత టెక్నాలజీ
- భారీ విపత్తుల సమయంలో అలర్ట్ చేయడమే లక్ష్యం

న్యూఢీల్లీ-02మే (మహాప్రభ )
భారత్ సొంత టెక్నాలజీతో విపత్తు హెచ్చరికల వ్యవస్థలను సిద్ధం చేస్తోంది. శనివారం జరిగిన ఈ పరీక్షల్లో భాగంగా దేశవ్యాప్తంగా లక్షలాది మంది మొబైల్ ఫోన్లు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో మారుమోగాయి. అసలు ఈ వ్యవస్థ ఎందుకు అవసరం? ఎలా పని చేస్తుంది? అనే వివరాలు తెలుసుకుందాం. శనివారం 11 గంటలకు చాలా మంది మొబైల్ వినియోగదారులు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వారి ఫోన్లకు ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా పెద్ద శబ్దంతో కూడిన బీప్ లు, వైబ్రేషన్లతో కూడిన సందేశం వచ్చింది. ఫోన్ స్క్రీన్‌పై అత్యవసర సేవల అలర్ట్ అని ఇంగ్లీష్, తెలుగులో హెచ్చరికలు కనిపించాయి. అయితే ఇది చూసి భయపడాల్సిన పని లేదు. భారత్ ప్రభుత్వం తన కొత్త ఎమర్జెన్సీ అలర్ట్ సిస్టమ్‌ను ప్రయోగాత్మకంగా
-మిగతా 3 లో

## పశ్చిమాసియా, ఐరోపాలు ముక్కలయ్యేవి.. బీ2 బాంబర్లతో అడ్డుకున్నా




## వచ్చే 4 రోజులు వానలు

- మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే అవకాశం
- పలు జిల్లాలకు ఎల్లో హెచ్చరిక జారీ
- రాష్ట్రంలో తగ్గుముఖం పట్టిన పగటి ఉష్ణోగ్రతలు



హైదరాబాద్ -02మే (మహాప్రభ )
రాష్ట్రంలో ఆదివారం నుంచి బుధవారం వరకు చాలా జిల్లాల్లో మోస్తరు వర్షం, కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న వెదర్ రిపోర్టులో వెల్లడించారు. -మిగతా 3 లో

## హర్మూజ్‌కు కొత్త నియమాలు

- ప్రకటించిన ఇరాన్
- అమెరికా దిగ్బంధనం కొనసాగించడంపై కఠిన నిర్ణయం



టెహ్రాన్ -02మే (మహాప్రభ )
హర్మూజ్ జలసంధిపై ఇరాన్ ఎన్ని విజ్ఞప్తులు చేసినా అమెరికా తన నౌకాదళ దిగ్బంధనాన్ని కొనసాగిస్తుంది. దీంతో ఇరాన్ కఠిన నిర్ణయం తీసుకుంది. కీలక సముద్ర మార్గమైన హర్మూజ్‌పై కొత్త నియమాలు అమలు చేస్తామని శనివారం ప్రకటించింది. దీంతో హర్మూజ్ విషయంలో -మిగతా 3 లో


# ఇరాన్ ప్రతిపాదనలు నచ్చలేదు

### మరోమారు మెలిక పెట్టిన ట్రంప్



**వాషింగ్టన్, -02మే (మహాప్రభ )**
పశ్చిమాసియాలో కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్నప్పటికీ శాంతి చర్చల విషయంలో మాత్రం పూర్తి స్పష్టత రావడం లేదు. అమెరికా, ఇరాన్‌ల మధ్య ఒప్పందం విషయంలో విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా పాకిస్థాన్ ద్వారా ఇరాన్ పంపించిన ప్రతిపాదన తనకు నచ్చలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే ఇరాన్‌పై సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని హెచ్చరించారు. 'ఇరాన్ ప్రతిపాదన అంగీకరించదగిన స్థాయిలో లేదు. ఒప్పందం సాధ్యమవుతుందో లేదో చెప్పడం కష్టం' అని ట్రంప్ తాజాగా పేర్కొన్నారు. దీంతో ఇరాన్-అమెరికా మధ్య చర్చలు ఇంకా అనిశ్చితిలోనే ఉన్నట్టు అర్థమవుతోంది. తమ దేశంపై ఆర్థిక ఆంక్షలు ఎత్తివేయాలని, నౌకా దిగ్బంధనం తొలగించాలని ఇరాన్ అడుగుతోంది. అలాగే అణు కార్యక్రమం గురించి ఇప్పటికప్పుడు ఒక ఒప్పందానికి రాకూడదని భావిస్తోంది. అయితే అమెరికా మాత్రం తమ డిమాండ్లను నెరవేరిస్తేనే చర్చలపై ముందుకు వెళ్లాలని అనుకుంటోంది అణు కార్యక్రమం విషయంలో పూర్లి స్పష్టత కావాలని, అలాగే హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరవాలని , అప్పటివరకు నౌకా దిగ్బంధన కొనసాగుతుందని అమెరికా స్పష్టం చేసింది. దీంతో ఇరు దేశాల మధ్య చర్చలు అనిశ్చితిలో పడ్డాయి. 'ఒప్పందం కుదరకపోతే ఇతర మార్గాలను కూడా పరిశీలించాల్సి వస్తుంది' అని ట్రంప్ తాజాగా హెచ్చరించారు. సైనిక చర్యలకు దిగే అవకాశాలున్నాయని సంకేతాలు ఇచ్చారు.


# ఢిల్లీలో యువ జడ్జి ఆత్మహత్య



**న్యూఢిల్లీ, -02మే (మహాప్రభ )**
దక్షిణ ఢిల్లీలోని సప్దర్‌గంజ్ ప్రాంతంలో జడ్జి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. జడ్జి అమన్ కుమార్ శర్మ (30) మృతదేహాన్ని ఆయన ఇంట్లో చూసిన బంధువు ఒకరు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం మధ్యాహ్నం 1.45 గంటల సమయంలో తమకు కాల్ వచ్చిందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని వారు పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. అసలేం జరిగిందో తెలుసుకునేందుకు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జడ్జి అమన్ కుమార్ శర్మ 2018లో సింబయాసిస్ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. 2019 జూన్ 19న ఢిల్లీ జుడీషియల్ సర్వీసెస్‌లో చేరారు. తన కెరీర్‌లో ఆయన పలు కోర్టుల్లో వివిధ సివిల్, క్రిమినల్ కేసులను డీల్ చేశారు. గతేడాది అక్టోబర్‌లో ఆయన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీగా బాధ్యతలు స్వీకరించారు.

# పేలుడు ఘటనలో ముగ్గురు జవాన్లు మృతి

**కాంకేర్ -02మే (మహాప్రభ )**
కాంకేర్ జిల్లాలో భూమిలో ఉన్న మందు పాతరలను తొలగించే క్రమంలో ఓ మందుపాతర (ఐఇడి) పేలి ముగ్గురు జవాన్లు మృతి చెందారు. ఈ ఘటన శనివారం కాంకేర్-నారాయణ్‌పూర్ సరిహద్దు సమీపంలో జరిగింది.



ఛోటేబెతియా పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీసుల బృందం మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించే క్రమంలోనే ఈ ఘటన జరిగింది. మృతి చెందిన వారు జిల్లా రిజర్వ్ గార్డ్ (డిఆర్‌జి)లు. ఇన్‌స్పెక్టర్ సుఖ్రామ్ వట్టి, కానిస్టేబుల్ కృష్ణ కొమ్రా, కానిస్టేబుల్ సంజయ్ గఢ్‌పాలేలు పోలీసులు ధృవీకరించారు. ఈ ఘటనలో మరొక కానిస్టేబుల్ పరమానంద్ కోమ్రా తీవ్ర గాయాలపాలయ్యారు. ఆయన ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నారు.

# యుద్ధం లేదు.. శాంతి లేదు..

### సీజ్‌ఫైర్‌పై ఇరాన్ ఆవేదన

**బెంగళూరు-02మే (మహాప్రభ )**
ఇజ్రాయెల్-అమెరికా కూటమి, ఇరాన్ మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న ఉద్రిక్తతలను 'యుద్ధం లేదు, శాంతి లేదు' వంటి పరిస్థితిగా భారత్‌లోని ఇరాన్ సుప్రీం నాయకుడి ప్రతినిధి అబ్దుల్



మజీద్ హకీమ్ ఇలాహీ అభివర్ణించారు.యుద్ధాన్ని తక్షణమే నిలిపివేయాలని పిలుపునిస్తూ ప్రపంచ స్థిరత్వం యుద్ధాన్ని ప్రారంభించిన వారిపైనే ఆధారపడి ఉందని అన్నారు. బెంగళూరులో మాట్లాడుతూ ఇరాన్ ఈ యుద్ధా న్ని కోరుకోవడం లేదని చెప్పారు.

# పూనేలో దారుణం..

# నాలుగేళ్ల చిన్నారిపై 65 ఏళ్ల వృద్ధుడి హత్యాచారం..

**న్యూఢిల్లీ, -02మే (మహాప్రభ )**
మహారాష్ట్రలోని పూనే పరిధిలో దారుణం జరిగింది. నాలుగేళ్ల చిన్నారిపై 65 ఏళ్ల వృద్ధుడు అత్యాచారానికి పాల్పడి, హత్య చేశాడు. ఈ ఘటనతో స్తానికులు ఆందోళనకు దిగారు. చివరకు పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పూనే, భోర్ తహసీల్ పరిధిలోని ఒక గ్రామంలో శుక్రవారం ఈ ఘటన జరిగింది. నాలుగేళ్ల చిన్నారిని ఒక వృద్ధుడు ఫుడ్ ఇప్పిస్తానని చెప్పి, తనతో తీసుకెళ్లాడు. దగ్గర్లోని ఒక పశువుల పాకలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. అనంతరం చిన్నారిని చంపేశాడుఅయితే, చిన్నారి పాప కనిపించకపోవడంతో తల్లిదండ్రులు, ఇతర కుటుంబ సభ్యులు తీవ్రంగా వెతికారు. పోలీసులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో ఒక ఇంటి సీసీ కెమెరాలో ఈ ఘటనకు సంబంధించిన దృశ్యం



రికార్డైంది. వృద్ధుడు చిన్నారిని తీసుకెళ్తున్నట్లు రికార్డ్ కావడంతో విషయం బయటపడింది. ఘటన అనంతరం నిందితుడు అక్కడి నుంచి పారిపోయాడు. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ జరిపారు. ఈ ఘటన గురించి తెలియడంతో స్థానికులు తీవ్ర ఆందోళన నిర్వహించారు. బెంగళూరు--ముంబై హైవేను దిగ్బంధించారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని, వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.అంతేకాదు, 15 రోజుల్లోగా ఛార్జిషీటు దాఖలు చేయాలని కోరారు. వీరి ఆందోళనతో కొంతసేపు ట్రాఫిక్ స్తంభించింది. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు, ఇతర అధికారులు నిరసనకారుల వద్దకు చేరుకున్నారు. నిందితుడిని త్వరగా అరెస్టు చేస్తామని, కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. మరోవైపు ఈ ఘటనపై అక్కడి ప్రతిపక్షం మండిపడింది. ప్రభుత్వ వైఫల్యం వల్లే ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని విమర్శించింది. అయితే, నిందితుడిపై కఠిన చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెప్పింది.

# బెంగాల్ సీఎం మమతాబెనర్జికి

# సుప్రీంకోర్టులో చుక్కెదురు!

**న్యూఢిల్లీ, -02మే (మహాప్రభ )**
పశ్చిమబెంగాల్ లో ఓట్ల లెక్కింపు వేళ టీఎంసీ అధినేత్రి , సీఎం మమతా బెనర్జీ కి సుప్రీంకోర్టు లో చుక్కెదురైంది. ఓట్ల లెక్కింపు సిబ్బందిని కేంద్ర ప్రభుత్వం నుంచి మాత్రమే ఎంపిక చేసుకునే అధికారం ఎన్నికల సంఘానికి ఉందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ఏప్రిల్ 13 నాటి ఈసీ సర్క్యులర్ తప్పని చెప్పలేమని స్పష్టంచేసింది.ఓట్ల లెక్కింపు కోసం కేవలం కేంద్ర ప్రభుత్వ సిబ్బందిని మాత్రమే నియమిస్తూ ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ మమతా బెనర్జీ తొలుత కలకత్తా హైకోర్టుకు వెళ్లారు. అయితే, ఈసీ నిర్ణయంలో ఎలాంటి అక్రమం లేదని హైకోర్టు పేర్కొన్నది. దీన్ని సవాల్ చేస్తూ ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. జస్టిస్ పీఎస్ నరసింహా, జస్టిస్



జోయ్‌మాల్య బాగ్చీలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మిశ్రమంగా కౌంటింగ్ సిబ్బంది ఉంటారని తమ సర్క్యులర్‌లో స్పష్టంగా పేర్కొన్నట్లు ఈసీ సుప్రీం ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. రిటర్నింగ్ అధికారిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగి ఉంటారని, కౌంటింగ్ సిబ్బందిని నియమించే అధికారం ఆయనకు ఉంటుందని తెలిపింది. ఓట్ల లెక్కింపులో అక్రమాలు జరుగుతాయన్న టీఎంసీ ఆందోళనలు నిరాధారమని వాదించింది. ఆ సర్క్యులర్‌ను తూచా తప్పకుండా అమలుచేస్తామని సుప్రీంకోర్టుకు హామీ ఇచ్చింది. టీఎంసీ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదిస్తూ.. ఆ సర్క్యులర్ ఏప్రిల్ 13 నాటిదని.. అయితే, దాని గురించి తమకు ఏప్రిల్ 29న తెలిసిందని అన్నారు. ఆ సర్క్యులర్‌లో ఉన్నదిఉన్నట్లుగా అమలు చేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. దాంతో జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ స్పందిస్తూ.. ఆ సర్క్యులర్ అమలు కావాలని ఆశిస్తున్నట్లయితే అసలు కోర్టు ముందుకు ఎందుకు వచ్చారని ప్రశ్నించారు. టీఎంసీ పిటిషన్‌ను తోసిపుచ్చుతూ.. దీనిపై తదుపరి ఆదేశాలు అక్కర్లేదని చెప్పారు.

# 200 సీట్లలో గెలవబోతున్నాం

### ఎగ్జిట్ పోల్స్ నమ్మబోమన్న మమత

**కోల్‌కతా న్యూఢిల్లీ, -02మే (మహాప్రభ )**
పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. ఈనెల 4న కౌంటింగ్ జరుగనుండటంతో కౌంటింగ్ ఏజెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారంనాడు ఆమె మాట్లాడారు. '200కు పైగా సీట్లతో మనం గెలవబోతున్నాం' అని ఈ సందర్భంగా మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. ఎగ్జిట్ పోల్స్ కేవలం స్టాక్ మార్కెను మభ్యపెట్టేందుకే తప్ప మరొకటి కాదని, 2021, 2024లోనూ వాళ్లు ఇదే చేశారని, ఇప్పుడు కూడా జరిగిందదేనని మమతా బెనర్జీ వివరించారు. సీఏపీఎఫ్ దౌర్యనాలకు గురైన టీఎంసీ కార్యకర్తలకు రాబోయే రోజుల్లో తాము రివార్డులిస్తామని చెప్పారు. కాగా, రెండు అసెంబ్లీ




నియోజకవర్గాల్లోని 15 పోలింగ్ కేంద్రాల్లో శనివారంనాడు రీపోలింగ్ జరిగింది. పెద్ద ఎత్తున ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. ఈ క్రమంలో సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు సైతం చోటుచేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 11 గంటల వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగులబెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీ బలగాలు మోహరించినా టీఎంసీ గుండాల హింస, ఆందోళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లోని ఒక స్టాంరగ్‌రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈనెల 4న పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

### ఇజ్రాయెల్ కోసం గూఢచర్యం ఆరోపణలు..

# ఇద్దరిని ఉరితీసిన ఇరాన్..

### యుద్ధ సమయంలోనూ అమలు

**న్యూఢిల్లీ, -02మే (మహాప్రభ )**
ఒక పక్క యుద్ధ సమయంలోనూ ఇరాన్ తన దేశంలో అణచివేత ఆపడం లేదు. ఇజ్రాయెల్‌కు గూఢచర్యం చేస్తున్నారనే ఆరోపణలపై ఇద్దరు వ్యక్తుల్ని ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. శనివారం ఈ ఘటన జరిగింది. సెంట్రల్ ఇస్ఫాహాన్ ప్రావిన్స్ పరిధిలోని నటాంజ్ న్యూక్లియర్ సైట్ వద్ద యగౌబ్ కరింపోర్, నాజర్ బకర్జాదే అనే ఇద్దరు వ్యక్తుల్ని ఉరితీసినట్లు స్థానిక మీడియా తెలిపింది. ఈ ఇద్దరూ ఇజ్రాయెల్‌కు ఇరాన్‌కు సంబంధించిన రహస్య సమాచారం చేరవేశారని ఇరాన్ ఆరోపించింది. ఇజ్రాయెల్‌కు చెందిన గూఢచార సంస్థ మొసాద్.ఈ సంస్థకు ఈ ఇద్దరూ ఇరాన్ ప్రభుత్వానికి సంబంధించిన వివరాలు, కీలక ప్రదేశాలు, మత సంబంధమైన



ప్రదేశాలతోపాటు న్యూక్లియర్ ప్లాంట్‌కు చెందిన సమాచారాన్ని చేరవేశారని ఇరాన్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ సమాచారాన్ని వీరు సేకరించి, మొసాద్ అధికారులకు అందజేసినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఈ నేరానికి గాను ఇరాన్ కోర్టు ఇద్దరికి మరణశిక్ష విధించింది. దీంతో శనివారం ఇరువురిని ఉరితీసింది. రెండు వారాల వ్యవధిలోనే ఇలా స్థానికుల్ని ఉరితీయడం ఇది రెండోసారి. గత ఏప్రిల్ 20న కూడా మొహమ్మద్ మాసౌమ్ షాహి, హమెద్ వాలిది అనే ఇద్దరు వ్యక్తుల్ని కూడా ఇదే గూఢచర్యం కింద ఇరాన్ ప్రభుత్వం ఉరితీసింది. వీరు ఇరాక్‌తోపాటు విదేశాల్లో శిక్షణ పొంది, ఇరాన్‌లో గూఢచర్యం చేస్తూ, మొసాద్‌కు సమాచారం అందిస్తున్నారని ఇరాన్ ఆరోపించింది.అయితే, వీరిపై వచ్చిన ఆరోపణల్ని వీరు పని చేసే మొజాహెదిన్ సంస్థ ఖండించింది. మరోవైపు ఇరాన్‌లో అమలవుతున్న మరణ శిక్షలపై ఐక్యరాజ్యసమితి మానవ హక్కుల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. గత ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇరాన్ ప్రభుత్వం కనీసం 21 మందిని ఉరితీసిందని పేర్కొంది. అలాగే, భద్రతా కారణాలతో 4,000 మందికిపైగా అరెస్టు చేసినట్లు తెలిపింది. కానీ, ఈ విషయంలో ఇరాన్ నుంచి అధికారిక ప్రకటన మాత్రం రాలేదు.

# బ్రిటన్ పార్లమెంట్‌లో కరీంనగర్‌వాసి ప్రసంగం

### ఎగువ సభలో లైఫ్ పీర్‌గా నియమితులైన నాగరాజు

**లండన్,-02మే (మహాప్రభ )**
బ్రిటన్ పార్లమెంట్‌లోని ఎగువ సభ (హౌస్ ఆఫ్ లార్డ్స్)లో లైఫ్ పీర్‌గా నియమితులైన భారత సంతతికి చెందిన ఉదయ నాగరాజు మొదటిసారి సభ్యులనుద్దేశించి శనివారం ప్రసంగించారు. హరింత ఇంధనంపై జరిగిన చర్చలో ఆయన పాల్గొంటూ..2030 నాటికి దేశంలో కాలుష్య రహిత విద్యుత్తు ఉత్పత్తిని సాధించాలన్న లక్ష్యాన్ని కొనియాడారు.ఈ ప్రక్రియలో సాంకేతికత, సృజనాత్మకతకు కృత్రిమ మేధస్సు (ఏఐ)ని జోడిస్తే అద్భుతాలు సాధించగలమని అన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని శనిగరం గ్రామానికి చెందిన నాగరాజు విద్యాభ్యాసం బ్రిటన్‌లోనే సాగింది. బ్రిటన్ పౌరసత్వం పొందిన ఆయనను ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్ సిఫారసు మేరకు రాజు కింగ్ చార్లెస్-3 గత డిసెంబర్‌లో లైఫ్ పీర్‌గా నియమించారు

# బంగాల్‌లో కౌంటింగ్ కు రెడీ

మొదటి తరువాయి




ఉపయోగించి ఈ నియామకాలు చేపట్టినట్లు ఎన్నికల కమిషన్ పేర్కొంది. ఓట్ల లెక్కింపు సమయంలో అబ్జర్వర్లు డెప్యుటేషన్ పద్ధతిలో తమ నియంత్రణ, పర్యవేక్షణలో పనిచేస్తారని ఈసీ పేర్కొంది. ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న 165 అసెంబ్లీ నియోజకవర్గాల్లో కౌంటింగ్ అబ్జర్వర్లకు సాయం చేసేందుకు ఈ అదనపు అధికారులను నియమించినట్లు పోల్ ప్యానల్ వివరించింది. “పోలీసు అబ్జర్వర్లు తమకు కేటాయించిన నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల వద్ద శాంతిభద్రతల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. అయితే ఎట్టి పరిస్థితుల్లోనూ పోలీసు అబ్జర్వర్లు ఓట్ల లెక్కింపు రోజున కౌంటింగ్ హాల్ లోకి ప్రవేశించరు. వీరు కౌంటింగ్ అబ్జర్వర్లతో, లెక్కింపు ప్రక్రియలో పాల్గొనే ఇతర ఎన్నికల యంత్రాంగంతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తారు” అని ఈసీ స్పష్టం చేసింది.

గుర్తింపు కార్డులు మస్ట్

ఇక రిటర్నింగ్ అధికారులు (ఆర్‌ఓ), కౌంటింగ్ సిబ్బంది, అభ్యర్థులు, వారి ఏజెంట్ల కోసం గుర్తింపు కార్డులను ఐటిబిఎస్ లోని ప్రత్యేక మాడ్యూల్ ద్వారా ఆర్‌ఓ జారీ చేస్తారని ఎన్నికల కమిషన్ పేర్కొంది. రిటర్నింగ్ అధికారులు జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో ఐడీ ఉంటేనే కౌంటింగ్ కేంద్రాల్లోకి అనుమతి ఇస్తారని, లేకుండా లోపలకు వెళ్లడం కుదరదని స్పష్టం చేసింది. కౌంటింగ్ అబ్జర్వర్, రిటర్నింగ్ ఆఫీసర్ మినహా మరిలెవరూ కౌంటింగ్ హాల్ లోపలికి మొబైల్ ఫోన్ తీసుకోవడానికి అనుమతి లేదని ఈసీ తేల్చిచెప్పింది. “కంట్రోల్ యూనిట్ లో కౌంటింగ్ సూపర్ వైజర్ లు లెక్కింపు ఫలితాలు ఉండే ఫామ్ 17సీ-పార్ట్ ×× సిద్ధం చేస్తారు. కౌంటింగ్ ఏజెంట్లకు వాటిని చూపిస్తారు. కౌంటింగ్ ఏజెంట్లు కోరుకుంటే ఈ ప్రక్రియను మళ్లీ పునరావృతం చేస్తారు. ప్రతి టేబుల్ వద్ద ఉండే మైక్రో-అబ్జర్వర్లు కూడా కంట్రోల్ యూనిట్ డిస్ ప్లేలో కనిపించే ఫలితాలను వేరుగా నోట్ చేసుకుంటారు. వారు క్రాస్ వెరిఫికేషన్ కోసం ప్రతి రౌండ్ వివరాల్లో ఆ వివరాలను కౌంటింగ్ అబ్జర్వర్లకు అందజేస్తారు” అని ఈసీ పేర్కొంది.

టీఎంసీ బెదిరింపులు- ప్రజల నిరసనలు

బంగాల్ లో ఓట్ల లెక్కింపు తర్వాత తమకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తూ దక్షిణ 24 పరగణా జిల్లా ఫాల్టాలో శనివారం వందలాది మంది గ్రామస్థులు నిరసన చేపట్టారు. ఆ ప్రాంతంలో టీఎంసీ కార్యకర్తల నుంచి తమకు ప్రాణహాని ఉందని వారు ఆరోపించారు. నిరసనకారులలో అధిక శాతం మహిళలు పాల్గొన్నారు. వారు బీజేపీ జెండాలను పట్టుకుని హసీమ్ నగర్ గ్రామంలో రహదారిని దిగ్బంధించారు. ఎన్నికల ఫలితాలు విడుదలైన తర్వాత తమపై దాడులు చేస్తామని టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ సన్నిహితుడు, స్థానిక పంచాయతీ ప్రధాన్ ఇసాఫిల్ బెదిరింపులకు పాల్పడుతున్నారని వారు ఆరోపించారు. దీనితో సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ భారీ బలగాలతో ఆ ప్రాంతాన్ని సందర్శించి, ప్రజలకు తగు భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చారు. బీజేపీ మహిళా మోర్చాకు చెందిన ఫాతిమా బీబీ మాట్లాడుతూ, “ఇసాఫిల్, అతని అనుచరులు ఏప్రిల్ 30 నుంచి మా ప్రాంతానికి వచ్చి, మే 5 నుంచి రక్తపాతం జరుగుతుందని మమ్మల్ని బెదిరిస్తున్నారు. అందుకే మా ప్రాంతంలో సీఆర్పీఎఫ్ బలగాలు కొనసాగాలని మేము డిమాండ్ చేస్తున్నాం” అని అన్నారు.

# ఉద్యోగుల డిమాండ్లకు సీఎం ఓకే

మొదటి తరువాయి

ఉన్న పీఆర్సీ అమలు, హెల్త్ కార్డుల జారీ వంటి ప్రధాన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సీఎంను కోరారు.

రెండేళ్లలో రాష్ట్రంలో 67,760 ఉద్యోగ నియామకాలు

ఉద్యోగుల పట్ల తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే తొలి నిర్ణయం తీసుకున్నామని, ప్రతి నెలా ఒకటో తేదీకే జీతాలు అందేలా చర్యలు చేపట్టామని వెల్లడించారు. గత రెండేళ్లలో రాష్ట్రంలో 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టినట్లు సీఎం వివరించారు. అలాగే రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని సీఎం పేర్కొన్నారు. వంద రోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లింపుల కోసం రూ. 6 వేల కోట్లు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. దీనితో పదవీ విరమణ చేసిన ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనకు ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న పీఆర్సీ అంశంపై తక్షణమే నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం వెల్లడించారు. ఆ నివేదిక ఆధారంగా పీఆర్సీపై ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. దీంతో ఉద్యోగుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ముఖ్యంగా పీఆర్సీ, హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వంటి అంశాలపై స్పష్టమైన హామీలు రావడంతో ఉద్యోగ సంఘాల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డితో కలిసిన ఉద్యోగ సంఘాల నేతల్లో మాం జగదీష్, ఏలూరి శ్రీనివాస రావు, బీ. శ్యామ్, చావ రవి, ముజీబ్ హుస్సేనీ, తదితరులు ఉన్నారు.

# పాంచజన్యంతో.. వస్తున్నాం

మొదటి తరువాయి

ధాన్యం కొనుగోళ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజులతరబడి పడిగాపులు కాస్తున్నారు. ధాన్యం కుప్పల పైనే ప్రాణాలు విడుస్తున్నారు.

ప్రభుత్వాలు ఇస్తున్న హామీల వల్ల ఉపాధి అంటే హాస్యాస్పదమైంది. మేం చెప్పే ఉపాధి కల్పన అంటే.. ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే కాదు. యువత, మహిళలు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి. యువత, మహిళలను వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రణాళికలు రూపొందిస్తున్నాం. రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రభుత్వాలు భర్తీ చేయని బ్యాక్‌లాగ్ ఉద్యోగాలను భర్తీ చేస్తాం అని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో కొత్త రాజకీయ శక్తిగా వస్తామని చెప్పాం.. వచ్చామని టీఆర్ఎస్ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. . అన్ని అడ్డంకులను అధిగమించి తెలంగాణ రక్షణ సేన పేరుతో రాజకీయ వేదికను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 20 ఏళ్లుగా కొనసాగుతున్న తెలంగాణ జాగృతి స్వచ్ఛంద సంస్థ అలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల సమస్యలపై తెలంగాణ రక్షణ సేన పోరాటం చేస్తుందని, సర్వోదయ తెలంగాణ లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు వెల్లడించారు. పాంచజన్యం పేరుతో ఐదు ప్రాధాన్య అంశాలను తీసుకున్నట్లు కవిత తెలిపారు. ఇప్పుడు ప్రతిపక్షంగా ఉన్నా, భవిష్యత్తులో అధికారంలోకి వచ్చినా ప్రధాన ఫోకస్‌గా ఉంటాయని చెప్పారు. ప్రజల ఆదాయంలో 60 శాతం విద్య, వైద్యం కోసమే ఖర్చవుతోందని.. దీని వల్ల సేవింగ్స్ సాధ్యం కావడం లేదని తెలిపారు. ప్రభుత్వం ఉచిత విద్య ఇస్తున్నా 75 శాతం మంది ప్రైవేటు సంస్థల్లో చదువుతున్నారని, వారందరికీ కూడా ఉచిత విద్య అందించేందుకు అన్ని లెక్కలు వేసినట్లు తెలిపారు. వైద్యం విషయంలో క్యాన్సర్ వంటి వ్యాధులతో చికిత్సకు డబ్బులేక చనిపోతున్న పరిస్థితి ఉందని కవిత అన్నారు. తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎన్ని లక్షలు ఖర్చైనా ప్రజల వైద్యం కోసం తెలంగాణ రక్షణ సేన ప్రభుత్వం వెనుకడుగు వేయదని హామీ ఇచ్చారు. రైతన్నలకు ఆత్మగౌరవం కల్పించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామని కవిత అన్నారు. ప్రస్తుతం కల్లాల దగ్గరే వడ్లు పడి ఉండటం, కొనుగోలు కేంద్రాలు తెరవాలని ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఉందని విమర్శించారు. రైస్ ఎగుమతి చేసే అవకాశాలున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఓ రైతు మక్కల కొనుగోలు కేంద్రంలోనే మరణించిన సంఘటనను ప్రస్తావించిన కవిత.. రైతు ప్రాణానికి విలువ లేకపోవడం బాధాకరమన్నారు. రైతన్నలకు మేలు చేసే విషయంలో తాము చాలా సీరియస్‌గా పనిచేస్తున్నామన్నారు. రాష్ట్రంలో ఉపాధి అంటే ఒక జోక్‌గా మారిందని.. యువత అవసరాలను ప్రభుత్వం అర్థం చేసుకోవడం లేదని కవిత విమర్శించారు. 18-25 ఏళ్ల జెన్ జీ యువతను నమ్ముతున్నట్లు చెప్పారు. మంచి ఆలోచనలతో వచ్చే 25-45 ఏళ్ల వారికి రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు రుణాలు ఇచ్చి ఉపాధి కల్పిస్తామని ప్రకటించారు. యువత ఉద్యోగాలు వెతకకుండా ఉద్యోగాలు ఇచ్చేలా తయారవ్వాలని.. గూగుల్, వాట్సాప్ లాంటి సంస్థలు తెలంగాణ నుంచి రావాలని ఆకాంక్షించారు. సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక శాఖ ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. 65 ఏళ్లు దాటి రిటైర్డ్ అయిన ఐఏఎస్, ఐపీఎస్‌లకు కూడా బ్యాంకులు రుణాలు ఇవ్వటం లేదన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక సీనియర్ సిటిజన్స్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటామని చెప్పారు. అగ్రవర్ణాల్లోని పేదలు, దివ్యాంగులు, మాజీ మావోయిస్టులు, మాజీ సైనికులు, అందరికీ ఇళ్లు కట్టించడం సామాజిక న్యాయమేనని కవిత వివరించారు.

అమ్మలా పాలన చేస్తేనే ప్రజలకు న్యాయం

జరుగుతుందని, తమ పాలన అలాంటిదే అని కవిత పేర్కొన్నారు. ఇకపోతే తండ్రిగా కెసిఆర్‌ను విమర్శించలేదని, బిఆర్ఎస్ అధ్యక్షుడిపైనే విమర్శలు చేశామన్నారు. తాతు తలపెట్టిన ఐదు అంశాలపై పెద్ద కసరత్తు చేశామని, తమవద్ద ప్రణాళిక ఉందని అన్నారు.

## రీపోలింగ్ లోనూ భారీగా ఓటింగ్

మొదటి తరువాయి

వరకూ ఎలాంటి ఘటనలు జరగనప్పటికీ ఆ తర్వాత సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టాలో టీఎంసీ, బీజేపీ మద్దతుదారుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా టీఎంసీ కార్యకర్తలు ఓటర్లను అడ్డుకున్నట్టు బీజేపీ కార్యకర్తలు ఆరోపించగా, ఓటింగ్ ప్రక్రియకు బీజేపీ కార్యకర్తలు అడ్డుపడుతున్నట్టు టీఎంసీ కార్యకర్తలు ఆరోపించారు. దీనికితోడు, ఫాల్టాలో స్థానికులు ఆందోళన బాటపట్టడం ఉద్రిక్తతలకు దారితీసింది. టీఎంసీ గూండాలు తమను బెదిరిస్తున్నారని, కేంద్ర బలగాలైన సీఏపీఎఫ్‌ను మోహరించి తమకు రక్షణ కల్పించాలని స్థానికులు రోడ్లపైకి వద్ద ఆందోళనలకు దిగారు. అధికారులు వెంటనే స్పందించడంలో సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ దళాలను మోహరించారు. టీఎంసీ గూండాలు బెదిరిస్తున్నారని, వారు గెలిస్తే తమ ఇళ్లు తగులబెడతారని, రక్తపాతం తప్పదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు భారీగా బలగాలను మోహరించినా టీఎంసీ గూండాల హింస, ఆందోళనకు ఆగడం లేదని బీజేపీ ఆరోపించింది. పశ్చిమబెంగాల్‌లోని ఒక స్టాం÷-రగ్‌రూమ్‌ను అనుమతి లేకుండా కొందరు తెరిచారని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనలను ఈసీ సీరియస్‌గా తీసుకుందని, స్థానికులను బెదిరించిన టీఎంసీ గూండాలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఆదేశించిందని అధికారులు చెప్పారు.

## హర్మూజ్‌కు కొత్త నియమాలు

మొదటి తరువాయి

ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. తాజా పరిణామం ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపనుందని అంతర్జాతీయ మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఇరాన్‌కు చెందిన ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జిసి) నౌకాదళం.. తమ తీర ప్రాంతం సుమారు రెండు వేల కిలోమీటర్ల వరకు నియంత్రణను కట్టుదిట్టం చేస్తామని తెలిపింది. ఈ ప్రాంతాన్ని ‘ప్రాంతీయ భద్రత, అభివృద్ధికి కేంద్రం’గా మార్చుతామని ప్రకటించింది. ఈ పరిణామాల నేపథ్యంలోనే ఇటు అమెరికా ట్రెజరీ సెక్రెటరీ స్కాట్ బెస్సెంట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌పై అమలు చేస్తున్న నౌకాదళ దిగ్బంధనం కొనసాగుతుందని స్పష్టం చేశారు. “ఫిబ్రవరి 27కు ముందు ఉన్నట్టుగా స్వేచ్ఛాయుత నావిగేషన్‌ను పునరుద్ధరించేంతవరకు ఈ చర్యలు ఆగవు” అని ఆయన స్పష్టం చేశారు.

## ట్రాఫిక్ ఉల్లంఘనులపై కఠిన చర్యలు

మొదటి తరువాయి

మరణాల సంఖ్య కూడా పెరుగుతున్నదని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సైతం సీరియస్‌గా ఉన్నారనీ, ఈ ప్రమాదాలను నివారించడానికి పోలీసులు అవసరమైన చర్యలను తక్షణమే చేపట్టాలని సీఎం ఆదేశించినట్టు ఆనంద్ తెలిపారు. ఓఆర్ఆర్‌లపై వాహనాలు నిలిపి ఉంచడాన్ని వెంటనే గమనించి వాటిని అక్కడి నుంచి తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నగరంలో ఏదేనీ చిన్న రోడ్డు ప్రమాదం జరిగినా.. విపరీతంగా ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతున్నదనీ, ఆ విషయమై తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకొని వెంటనే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించి వాహనదారులకు అసౌకర్యం కలగకుండా చూడాలని డీజీపీ సూచించారు. ముఖ్యంగా డ్రంకెన్ డ్రైవర్స్‌పై ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలనీ, రోడ్డుపై తాగి డ్రైవింగ్ చేస్తే తమకు ఇబ్బందులు ఎదురవుతాయనే భావనను వారిలో కలిగించాలని ఆయన కోరారు. ట్రాఫిక్ రూల్స్ నిబంధనలను ఉల్లంఘించేవారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలనీ, ముఖ్యంగా హెల్మెట్ ధరించడం, సీటు బెల్టులను పెట్టుకోవడంపై నిశితంగా దృష్టిని సారించి అమలు చేయాలని ఆయన కోరారు. హైదరాబాద్‌తో సహా నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ డీసీపీలు రెండు నెలలకోసారి సమావేశమవుతూ ట్రాఫిక్ సమస్యపై ఎదురవుతున్న సవాళ్లను అధిగమించడానికి ఎప్పటికప్పుడు కార్యాచరణను రూపొందించుకొని అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో నాలుగు కమిషనరేట్ల ట్రాఫిక్ డీసీపీలు చందనాదీప్తి, రాహుల్ హెగ్డే, కాజోల్, రాహుల్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## వచ్చే 4 రోజులు వానలు

మొదటి తరువాయి

ఆదివారం, సోమ వారాల్లో కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయి. ఈ మేరకు ఆ జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. ఐదో తేదీన మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, ఆరో తేదీన నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే సూచనలున్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆ రెండు రోజుల పాటు మిగతా అన్ని జిల్లాల్లోనూ పలు ప్రాంతాల్లో వర్షం పడొచ్చు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో వచ్చే 48 గంటల పాటు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గరిష్ట ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు, కనిష్ట ఉష్ణోగ్రతలు 28 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశాలున్నాయి. శనివారం రాష్ట్రంలో ఎండలు కాస్త తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ చాలా జిల్లాల్లో 40 డిగ్రీలకుపైనే పగటి ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. నిజామాబాద్ జిల్లాలో అత్యధికంగా 44 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత నమోదైంది.

# నైరుతి వచ్చేస్తోంది!

మొదటి తరువాయి



వారంలో వచ్చే రుతుపవనాలు, ఈసారి మే 14 నుంచి 16 తేదీల మధ్యలోనే అండమాన్ నికోబార్ దీవులను తాకనున్నాయని వెల్లడించింది. మే నెలలో దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. దక్షిణాది, పశ్చిమ భారతంలో కుండపోత వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయని, ఈశాన్య, తూర్పు మధ్య భారతంలో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావొచ్చని చెప్పింది.

రాత్రిపూట కూడా తప్పని సెగలు

వర్షాల సూచన ఉన్నప్పటికీ, ఎండల తీవ్రత విషయంలో ఐఎండీ హెచ్చరికలు జారీ చేసింది. మే నెలలో పగటి ఉష్ణోగ్రతలే కాకుండా, రాత్రిపూట ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా ఉండనున్నాయని పేర్కొంది. దక్షిణ భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణంగా లేదా అంతకంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని చెప్పింది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఒడిశా, పశ్చిమ బెంగాల్ వంటి తీరప్రాంత రాష్ట్రాల్లో వాతావరణం భిన్నంగా ఉండనుంది. సముద్రం నుంచి వచ్చే తేమతో కూడిన గాలుల వల్ల ఉష్ణోగ్రతలు తక్కువగా అనిపించినా, ఉక్కపోత విపరీతంగా ఉంటుందని తెలిపింది. రాజస్థాన్, గుజరాత్ వంటి ప్రాంతాల్లో వడగాల్పుల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.

## నెట్‌వర్క్ లేకపోయినా ఎమర్జెన్సీ అలర్ట్

మొదటి తరువాయి

పరీక్షించడంలో భాగంగానే ఈ సందేశాలను పంపింది.

కమ్యూనికేషన్ కోసం..

మొబైల్ ఫోన్లకు వచ్చిన ఆ సందేశం ఇలా ఉంది. “భారత్ తన పౌరుల కోసం తక్షణ విపత్తు హెచ్చరిక సేవలను అందించేందుకు స్వదేశీ సాంకేతికతను ఉపయోగించి సెల్ బ్రాడ్ కాస్ట్‌ను ప్రారంభించింది. అప్రమత్తమైన పౌరులే సురక్షితమైన దేశానికి ఆధారం. ఈ సందేశం అందిన తర్వాత ప్రజలు ఎటువంటి చర్య తీసుకోవాల్సిన పని లేదు. ఇది కేవలం భారత్ ప్రభుత్వం పంపిన పరీక్ష సందేశం మాత్రమే”. ఈ పని భారత్ ప్రభుత్వంలోని రెండు కీలక విభాగాలు సమన్వయం చేసుకుంటున్నాయి. టెలికమ్యూనికేషన్ల శాఖ టెక్నాలజీ సహకారం, మొబైల్ నెట్‌వర్క్‌ల ద్వారా సందేశాల పంపిణీ బాధ్యతను చూస్తుంది. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ విపత్తు నిర్వహణలో భాగంగా పౌరుల ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడం దీని ప్రధాన లక్ష్యం. ఈ రెండు విభాగాలు కలిపి దేశవ్యాప్తంగా మొబైల్ ఆధారిత విపత్తు కమ్యూనికేషన్ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నాయి.

విపత్తుల సమయంలో అలర్ట్..

గతంలో సునామీలు, తుపాన్లు, భూకంపాలు వచ్చినప్పుడు సమాచారాన్ని ప్రజలకు చేరవేయడానికి రేడియోలు, టీవీ లేదా సాధారణ ఎస్ఎంఎస్‌పై ఆధారపడాల్సి వచ్చేది. అయితే, విపత్తు సమయంలో నెట్‌వర్క్ జామ్ కావడం లేదా సమాచారం అందడంలో జాప్యం వల్ల ప్రాణ నష్టం ఎక్కువగా ఉండేది. ఈ వ్యవస్థతో సెకనుల వ్యవధిలోనే కోట్ల మందికి ఏక కాలంలో సమాచారాన్ని చేరవేయవచ్చు. సాధారణ ఎస్ఎంఎస్‌ల వలె కాకుండా, ఇది సెల్ బ్రాడ్ కాస్ట్ టెక్నాలజీపై పని చేస్తుంది. దీని వల్ల నెట్‌వర్క్ రద్దీగా ఉన్నా సందేశం నేరుగా ఫోన్ స్క్రీన్‌పై కనిపిస్తుంది.

తుపాన్లు, వరదలు, సునామీ వంటి విపత్తులు వచ్చేటప్పుడు ప్రజలను ముందుగా సురక్షిత ప్రాంతాలకు వెళ్లమని హెచ్చరించడానికి ఇది అద్భుతంగా పని చేస్తుంది. ఇది పూర్తిగా భారతీయ టెక్నాలజీతో తయారు చేశారు. దీని వల్ల భద్రత, నియంత్రణ మన చేతుల్లోనే ఉంటుంది. ఈ వ్యవస్థ సెల్ బ్రాడ్ కాస్ట్ అనే టెక్నాలజీ ఉపయోగిస్తారు. మీరు ఇంటర్నెట్ ఆన్‌లో ఉంచకపోయినా మెసేజ్ వస్తుంది. ఫోన్ సైలెంట్ మోడ్‌లో ఉన్నా కూడా ఎమర్జెన్సీ అలర్ట్ వస్తుంది. ఇది టెలికాం టవర్ల ద్వారా నిర్ణీత ప్రాంతాల్లోని మొబైల్ ఫోన్లన్నింటికీ ఏక కాలంలో సిగ్నల్ పంపుతుంది.

# మేమున్నాం.. ఆదుకుంటాం

మొదటి తరువాయి

ఉంటామని భరోసా ఇచ్చారు.

వేసవి సెలవులని..

రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని సర్దార్ నగర్ కు చెందిన బొల్లి శివకుమార్ (40), బొల్లి లాస్య (35) దంపతులకు కూతురు రిషిక (8) ఉన్నారు. వీరు హైదరాబాద్ సనత్ నగర్ లో నివాసం ఉంటున్నారు. శివకుమార్ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తుండగా, లాస్య సివిల్ సప్లై శాఖలో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. వేసవి సెలవులు కావడంతో సిరిసిల్లలో ఉంటున్న శివకుమార్ సోదరి కోడం తేజశ్రీ (శ్వేత) (36), భర్త శ్రీనివాస్ (41), పిల్లలు కృష్ణచంద్ర (14), మాధవ్ (11)తో కలిసి గురువారం హైదరాబాద్ కు వెళ్లారు.

దైవదర్శనం చేసుకుని వస్తూ..

శుక్రవారం రెండు కుటుంబాలు యాదగిరిగుట్ట, స్వర్ణగిరిలో దైవదర్శనానికి వెళ్లాయి. తిరుగు ప్రయాణంలో సాయంత్రం 4 గంటల ప్రాంతంలో శంషాబాద్ ఓఆర్ఆర్ పై 16వ ఎగ్జిట్ వద్ద ఆగి ఉన్న లారీని వీరు ప్రయాణిస్తున్న కారు అతివేగంగా ఢీకొన్నది. దీంతో కారు లారీలో ఇరుక్కుని నుజ్జునుజ్జయింది. అక్కడికక్కడే ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. కారులో నుజ్జయిన మృతదేహాలను అతికష్టం మీద వెలికితీశారు. ఈ ప్రమాదంలో శివకుమార్, లాస్య, శ్రీనివాస్, చిన్నారులు రిషిక, కృష్ణచంద్ర, మాధవ్ మృత్యువాత పడ్డారు. కోడం తేజశ్రీ (శ్వేత) చావు బతుకుల్లో ఉండగా హైదరాబాద్ ఉస్మానియా దవాఖానకు తరలించారు.

## పశ్చిమాసియా, ఐరోపాలు ముక్కలయ్యేవి.. బీ2 బాంబర్లతో అడ్డుకున్నా : ట్రంప్

**న్యూఢిల్లీ,**

ఇరాన్‌పై యుద్ధాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి సమర్థించుకున్నారు. బీ2 బాంబర్లతో ఆ దేశంపై దాడి చేసి..అది అణ్వాయుధాన్ని తయారు చేయకుండా అడ్డుకొన్నామని అన్నారు. ఒకవేళ తాను అలా చేయకుంటే..పశ్చిమాసియా, ఐరోపా దేశాలు ముక్కలైపోయి ఉండేవని వ్యాఖ్యానించారు.ఫ్లోరిడాలో మాట్లాడుతూ ఇరాన్ నాయకత్వం కూడా బలహీనపడిందని పేర్కొన్నారు. దీంతో ఆ దేశ సైనిక సామర్థ్యం గణనీయంగా క్షీణించిందని తమ సైనిక చర్యతో నాశనమైందని తెలిపారు.

# సంపాదకీయం

## రుజువు కోసం...



తను తానేనని నిరూపించుకోవడం మనిషి నిరంతర యాతన మరొక అంతులేని తంతు. అనవసరానికి అవసరానికి అత్యవసరానికి రుజువులు అడిగే దేశంలో.. శవాలు లేచి నడచి రావడంలో వింతేమీ లేదు. అమానవీయత రాజకీయమై అలవికాని నిబంధనలు రాజ్యాన్నేలుతున్నప్పుడు, సమాధుల నుండి కుళ్లిన ధృవీకరణ పత్రం లేచిరాక తప్పడం లేదు' మాటూరి సమతా సాహితి దు:ఖ కవితా పంక్తులివి. వాస్తవ ఘటనకు అద్దం పడుతున్న ఆవేదనాక్షరాలు. ఇప్పటికే సంఘటనేమిటో మీకు అర్థమయ్యే ఉంటుంది. బహుశా మనకు ఒక సాధారణ సమస్యగానే తోచి కూడా ఉంటుంది. ఎందుకంటే, ఇలాంటివి ఎన్ని చూడలేదు మనం! ఒకవైపు ఏఐ టెక్నాలజీతో, రోబోలతో, చాట్‌జీపీటీలతో, మానవ మేధస్సును, ఉద్యోగాలను సైతం అనుకరించి, అనుసరించి దాటి పైపైకి ఎగబాకుతున్న నవయుగం ఒకవైపు, ఒక ప్రశ్నకు, సమస్యకు ఎట్లా సమాధానం వెతకాలో తెలియని, తెలిసినా పరిష్కరించుకోలేని నిస్సహాయక, నిత్య దారిద్ర్య సమూహం ఇంకొకవైపు. ఇదీ వైరుధ్యాల భారతం! ఇప్పుడు విజ్ఞానం ఎంతో సులువైంది, కానీ జీవితం ఎంతో బరువైపోతోంది. మనమెవరమో మనమే నిరూపించుకోవాలి. మన ఆనవాలును గుర్తించ నిరాకరిస్తారు. నేనీ దేశం వాడినో కాదో కూడా నేనే సాక్ష్యాలతో ఇప్పుడు నిరూపించుకోవాలి. అంతేకాదు, నాపైన నేరం మోపబడుతుంది. జైల్లో నిర్బంధించబడతాను. అప్పుడు కూడా నాపై మోపిన నేరం నేను చేయలేదని సాక్ష్యాలతో సహా నిరూపించుకోవాలి (ఉపా) లేదంటే, వాళ్లు ఆరోపించిన నేరస్తున్నయిపోతాను. శిక్షకు అర్హున్నయిపోతాను. ఓటర్ల జాబితాలో పేర్లు తొలగడమేకాదు, పౌరసత్వమూ రద్దు చేయబడుతుంది. నేను భారతీయున్నే అని ఎంత మొత్తుకున్నా ఎవడూ వినడు. నేను బతికున్నానన్నా వినడు. నేను చచ్చాననీ చెప్పిన రుజువేమిటంటాడు. ఈ దేశంలోనే రెండోరకం ప్రజలకు ఈ ప్రశ్నలన్నీ చుట్టుముడుతాయి. మొదటి రకం మనుషులకు ఇవేమీ వర్తించవు! దీనికి సంబంధించిన నగ్న సంఘటన ఒకటి ఒరిస్సాలో జరిగింది. సామాజిక మాధ్యమాలలో ఫోటోలు, వార్తలు వైరల్ అవుతున్నవి. చాలా హృదయ విదారకంగా కనిపిస్తున్నాయి. ఒడిస్సాలోని కెఓంజార్‌కు చెందిన ఒక పేద ఆదివాసీ అతడు. అతనిపేరు జీతుముండా. అతనికి ఒక చెల్లి ఉండింది. రెండు నెలల క్రితం పాపం అనారోగ్యంతో చనిపోయింది. ఆమె ఉన్నపుడు, తన పశువులను అమ్మగా వచ్చిన డబ్బును, తన బ్యాంకు ఖాతాలో దాచుకున్నది. బ్రతికున్న ఒకే ఒక్క అన్న జీతూ, బ్యాంకు వాళ్ల దగ్గరికి వెళ్లి మా చెల్లి దాచుక్ను డబ్బు నా అవసరాలకు కావాలని, ఇవ్వమని అడిగాడు. బ్యాంకు వాళ్లు, ఖాతాదారులు వస్తేనే ఇస్తామని సెలవిచ్చారు. చెల్లి చనిపోయిందని పదిసార్లు చెప్పాడు. వాళ్లు పెద్దగా పట్టించుకోలేదు. నాలుగుసార్లు బ్యాంకు చుట్టూ తిరిగాడు. ఆఖరికి వాళ్లు ఆమె చనిపోయిన 'డెత్ సర్టిఫికెట్', సక్సెషన్ సర్టిఫికెట్ (నామినీ, వారసుడు) కావాలన్నారు. అవేమిటో, ఎక్కడ దొరుకుతాయో ఆ ఆదివాసీకి తెలియదు. తిరిగీ తిరిగీ.. చెల్లి చనిపోయిన రుజువు కావాలి కదా! అని ఒక రోజు చెల్లి సమాధిని తవ్వి, ఎముకల గూడుగా మిగిలిన చెల్లి అస్థిపంజరాన్ని భుజం మీద వేసుకుని, ఎండలో మైళ్లకు మైళ్లు నడిచి బ్యాంకు వద్దకు చేరుకున్నాడు. ఒంటి మీద అతనికి కప్పుకునే గుడ్డాలేదు. అధికారులముందు.. ఇదిగో మా చెల్లి చనిపోయిందని చూపించాడు. ఇంత దారుణమైన భారతదేశం ఒకవైపు మనల్ని దు:ఖితులను చేస్తున్నది. అప్పుడుగాని అధికారులు కదలలేదు. కలెక్టరు కలుగజేసుకుని అతని డబ్బును ఇప్పించారు. దారిద్ర్యంలో మగ్గే, అక్షర జ్ఞానం లేని, గ్రామీణ ఆదివాసీకి సర్టిఫికెట్లు తెచ్చుకోవటం సాధ్యమా? ఈ విషయం అధికారులకు తెలియదా! ప్రజా ప్రతినిధులకూ తెలియదా! ప్రభుత్వాలు, పరిపాలన, చట్టాలు, విధానాలు అన్నీ ఎవరికోసం? ప్రజల కోసం కాదా? అదే ఈ నిబంధనలన్నీ ధనికుల, కార్పొరేట్ల విషయానికి వచ్చే సరికి మొత్తం సులవై, సులభమైపోతాయి. పేదల విషయానికొస్తే రూల్స్ అన్నీ గట్టిపడి, హృదయ రహితంగా మారిపోతాయి. ఇదే రెండు భారతాలు. అనిల్ అంబానీలు, విజయమాల్యాలు, నీరవ్ మోడీలు బ్యాంకుల నుండి అక్రమంగా డబ్బు తరీసుకోగలరు. ఎగ్గొట్టి దేశం విడిచి హాయిగా వెళ్లిపోగలరు. ఏ చట్టమూ వారిని అడ్డుకోదు. ఒక్క జీతు ముండాకు కష్టమైన పనిగా మారుతుంది. అదీ వాస్తవాన్ని నిరూపించుకోవటం! ఒక ఆదివాసీ మహిళ రాష్ట్రపతిగా ఉంది. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రీ ఆదివాసీనే! కానీ అక్కడి ఆదివాసీ ప్రజల బతుకులు ఏమీ మారలేదు. తమ కులంవాడో, జాతివాడో, ప్రాంతంవాడో అందలమెక్కగానే ఆ వర్గమంతా ఏమీ మారదు అనటానికి ఇదో ఉదాహరణ. ఈ బతుకు మారటానికి పోరాటమొక్కటే మార్గం!

## జెసిఐ ఛాంపియన్ సంస్థ ఆధ్వర్యంలో వర్క్ షాప్ విజయవంతం.




**మెదక్ జిల్లా -02మే (మహాప్రభ )**
జెసిఐ హైద్రాబాద్ ఛాంపియన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ వర్క్ షాప్ విజయవంతంగా పూర్తయిందని, జాతీయ ట్రైనర్ రవికుమార్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్క్ షాప్ లో రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన వారు నైపుణ్యాలను మెరుగు పరుచుకోవటం,ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించు కోవడం,వేదికపై ప్రసంగించే సామర్థ్యంను అభివృద్ధి చేసుకోవటం,వ్యక్తిత్వ వికాసానికి అవసరమైన ఎన్నో విషయాలను నేర్చుకున్నారని వెల్లడించారు.ఇది ప్రతీ ఒక్కరి స్వీయాభివృద్ధికి ఎంతో ఉపయోగపడే కార్యక్రమం అని అని పేర్కొన్నారు.ఇలాంటి ఎన్నో ఉపయోగకరమైన కార్యక్రమాలను మరెన్నో నిర్వహిస్తామని హైద్రాబాద్ ఛాంపియన్ ప్రెసిడెంట్ కిషోర్ కుమార్ తెలిపారు.అనంతరం కార్యక్రమంలో పాల్గొన్నవారికి బహుమతులు అందజేసినట్లు చెప్పారు.

## వాంకుడోత్ భాస్కర్ మృతి బాధాకరం

-నేనావత్ బాలు నాయక్

**దేవరకొండ డివిజన్ మే 02 ( మహాప్రభ )**
నియోజకవర్గంలోని చింతపల్లి మండలం, ధైర్యపురి తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త వాంకుడోత్ భాస్కర్ ం/శీ మంగ్య మరణించిన విషయం తెలుసుకొని వారి నివాసానికి వచ్చి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళి అర్పించిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భాస్కర్ మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని ఎమ్మెల్యే బాలు నాయక్ లిఅన్నారు. వారి వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీతో లబ్ధిదారులకు భరోసా కల్పించిన జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి,మే 2 (మహాప్రభ )**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ వి. జగదీశ్వర్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారుల కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో యలమంచి ఉదయ్ కిరణ్ పాల్గొని, లబ్ధిదారుల కుటుంబాలకు అండగా నిలుస్తూ ప్రజా సేవ పట్ల నిబద్ధతను చాటుకున్నాను. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "ఇందిరమ్మ రాజ్యం" లక్ష్యంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ ఫలాలు చేరేలా కృషి చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఒక గొప్ప భరోసాగా నిలుస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వం ఎల్లప్పుడూ ప్రజలకు అండగా ఉంటుందని, ముఖ్యంగా సంక్షోభ సమయాల్లో మరింత సహాయ సహకారాలు అందిస్తుందని తెలిపారు. కుటుంబంలో ప్రధాన సభ్యుడు అనారోగ్యానికి గురైతే మొత్తం కుటుంబం ఇబ్బందులు ఎదుర్కొంటుందని, అలాంటి సమయంలో సీఎంఆర్ఎఫ్ అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా మారి ప్రాణాలను కాపాడటంలో కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. సీఎంఆర్ఎఫ్ అనేది కేవలం ఒక నిధి కాదు... నిరుపేదలకు ఆశ, బాధలో ఉన్న వారికి బలం అని జగదీశ్వర్ గౌడ్ అన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



**పాపన్నపేట, మే2( మహాప్రభ )**
రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధి లోని అన్నారం గ్రామ శివారులో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం .. అబ్లాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి బాలరాజు (30) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం పని నిమిత్తం తన బైక్ పై మెదక్ వెళ్లి రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా అన్నారం గ్రామ శివారులోకి రాగానే ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్ ను ఢీ కొట్టింది. దీంతో బైక్ పై ఉన్న బాల్ రాజుకు కిందపడగా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మెదక్ జిల్లా ఆసుపత్రి కీ తరలించారు. మృతుడి భార్య శైలజ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

## ప్రజా పాలన -ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ విజయవంతం.






-ఆర్డీవో రమణారెడ్డి ఆధ్వర్యంలో సమీక్షా సమావేశం.
-ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరు.

**దేవరకొండ, -02మే (మహాప్రభ )**
తెలంగాణ రాష్ట్రప్రభుత్వంప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా దేవరకొండ నియోజకవర్గ స్థాయి సమీక్షా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఆర్డీవో రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు నియోజకవర్గంలో గత రెండున్నర సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి పనులు, అమలవుతున్న సంక్షేమ పథకాల పురోగతిపై సమగ్ర నివేదికను సమర్పించారు. వ్యవసాయం, విద్య, వైద్యం, మిషన్ భగీరథ, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, మహాలక్ష్మి, గృహజ్యోతి, చేయూత పథకాల అమలు తీరును అధికారులు వివరించారు. అనంతరం ఎమ్మెల్యేనేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. "ప్రజల వద్దకే పాలన" అనే లక్ష్యంతో 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ద్వారా ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని చెప్పారు.
నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, రోడ్లు, తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పన వేగంగా జరుగుతోందని వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు పారదర్శకంగా పనిచేయాలని సూచించారు. అనంతరం... గ్రోమోర్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎరువుల ప్రదర్శన స్టాల్‌ను సందర్శించి రైతులకు అందిస్తున్న ఎరువుల నాణ్యత, వినియోగ విధానం గురించి వివరాలు తెలుసుకున్నారు. అలాగే గిరిజనుల చేతితో తయారు చేసిన వస్తువుల ప్రదర్శన స్టాళ్లను సందర్శించి వారి ఉత్పత్తులను ప్రోత్సహిస్తూ, మార్కెటింగ్ అవకాశాలను పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ, వైద్య, విద్య, పంచాయతీరాజ్, ఆర్అండ్బీ, మిషన్ భగీరథ శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్పర్సన్‌గా యంజాల కీర్తన ప్రమాణ స్వీకారం...

**తూప్రాన్, -02మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా తూప్రాన్ నూతన మార్కెట్ కమిటీ కి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో శనివారం చైర్ పర్సన్ గా యంజాల కీర్తన విఠల్ రెడ్డి బాధ్యతలు చేపట్టారు. వైస్ చైర్మన్ గా మామిండ్ల కృష్ణ ముదిరాజ్, డైరక్టర్ లుగా సింగి మైపాల్ రెడ్డి, జక్కిడి ప్రభాకర్ రెడ్డి, నావబోత్ శ్రీనివాస్, మాదం శెట్టి వెంకటేష్ గుప్తా, సంద వెంకటేష్ యాదవ్, గొల్లపల్లి సురేందర్ రెడ్డి, మహ్మద్ హమీద్, ఊట్ల సత్యనారాయణ ముదిరాజ్, దొడ్ల వెంకటేష్, దాసరి నాగరాణి లక్ష్మణ్ లు కార్యాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన



అనంతరం బాధ్యతలు చేపట్టారు. రైతు వ్యవసాయ మార్కెట్ ఏర్పాటు చేసి 9 ఏళ్లకు నూతన పాలక వర్గం ఏర్పాటు కావడం రైతులు నాయకులు సంతోషం వ్యక్తం చేశారు. ఉమ్మడి తూప్రాన్ మండలానికి కొత్త మార్కెట్ కమిటీ ఏర్పాటుతో రైతులకు వ్యవసాయ ఉత్పత్తుల అమ్మకాల్లో మరింత సౌలభ్యం కలుగుతుంది. మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 11 మంది డైరెక్టర్లను నియమించారు. అతి త్వరలోనే మంత్రి, పార్టీ ఇంచార్జ్ లతో భారీగా రైతులతో సభ ఏర్పాట్లు చేస్తాం అని పాలకవర్గం తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గంగుమల ఎలక్షన్ రెడ్డి, మాజీ ఎంపీపీ పురం నవనీత రవి ముదిరాజ్, మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షులు పంజాల సుధాకర్ రెడ్డి, సర్పంచ్ లు కాంగ్రెస్ నాయకులు హాజరై చైర్మన్ పాలక వర్గాన్ని సన్మానించారు.

# శ్రీశ్రీశ్రీ దుర్గా భవాని, పెద్దమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేత

**మెదక్ జిల్లా --02మే (మహాప్రభ )**
మెదక్ జిల్లా హవేలిఘనపూర్ మండలంలోని వాడి గ్రామంలో ఈ నెల 9 నుండి 11 తేదీల వరకు శ్రీశ్రీశ్రీ దుర్గా భవాని ఆలయ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అదేవిధంగా శంకరంపేట (ఆర్) మండలంలోని చందాపూర్ గ్రామంలో ఈ నెల 11 నుండి 14 వరకు శ్రీశ్రీ పెద్దమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వాడి మాజీ సర్పంచ్ యామి రెడ్డి, చందాపూర్ సీనియర్ నాయకులు పడాల శ్రీనివాస్,ఆలయ కమిటీ సభ్యులు మరియు ముదిరాజ్



సంఘం నాయకులు శనివారం హైదరాబాద్ కొంపల్లిలో మాజీ డిప్యూటీ స్పీకర్ యం. పద్మ దేవేందర్ రెడ్డి గారిని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శ్రీ దుర్గా భవాని మరియు పెద్దమ్మ దేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలకు రావాల్సిందిగా ఆహ్వాన శుభ పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో వాడి మాజీ సర్పంచ్ యామి రెడ్డి, మాజీ ఎంపీటీసీ సిద్ధారెడ్డి, ఉప సర్పంచ్ నాగరాజు, నాయకులు శంకర్ రావు, ప్రతాప్ రెడ్డి, దుర్గ,శివయ్య, సాయిలు, చందాపూర్ ముదిరాజ్ సంఘం నాయకులు గుడ్డముల శివరాములు, పోతారాజు సత్యనారాయణ, అరిగే రాములు, పోతారాజు పోచయ్య, అరిగే సిద్దిరాములు, ఆంజనేయులు, రమేష్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల’ కార్యక్రమం జిల్లాలో దిగ్విజయం

**- కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ జిల్లా -02మే (మహాప్రభ )**
శనివారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించారు. మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ , మెదక్ మున్సిపల్ చైర్మన్ రాధికా భూపతి రాజు,, రామాయంపేట మున్సిపల్ చైర్మన్ లావణ్య,మున్సిపల్ వైస్ చైర్మన్లు మెదక్ దొంతి నరేష్ గౌడ్, , రామాయంపేట నబితా జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ముందుగా వివిధ శాఖల ద్వారా ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ను పరిశీలించారు.
ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయి నుండి గ్రామీణ ప్రాంతం వరకు ఈ కార్యక్రమాలు అమలు జరుగుతున్నట్లు తెలిపారు. వార్డు సభ్యులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లకు ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై అవగాహన కల్పించామని అన్నారు. చేపట్టిన కార్యక్రమాలను అన్ని శాఖలలో అమలు చేశామన్నారు. ప్రతి గ్రామం, మున్సిపాలిటీల్లో గ్రామసభలు నిర్వహించి శాఖల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేసి అమలు చేస్తున్నామన్నారు. ముఖ్యంగా హెల్త్ కార్యక్రమాలు నిర్వహించి వైద్య పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. పోలీస్ రమణా శాఖ ద్వారా అరైవ్ ... అలైవ్ కార్యక్రమం నిర్వహించి రోడ్డు భద్రతపై కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. గ్రామస్థాయిలో రోడ్డు సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. క్రైమ్ కంటే రహదారి ప్రమాదంలో చాలామంది మరణిస్తున్నారని ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో జరగనున్న రైతు వారం, సంక్షేమ వారోత్సవాలు, చైల్డ్ సేఫ్టీ, నో డ్రగ్స్, వ్యవసాయం, యువజన సర్వీసులు, విద్య, మహిళలు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఉన్నాయని విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు. క్షేత్రస్థాయి వరకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అభివృద్ధి కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని, అభివృద్ధి కోసం ఇన్నోవేషన్ ఐడియాలు అమలు చేయాలని తెలిపారు. అంతకుముందు వ్యవసాయ, ఉద్యానవన, ఇందిరమ్మ ఇండ్లు, వైద్య, మెప్మా, విద్యుత్ ఇందిరా మహిళా శక్తి, కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్, న్యూ రేషన్ కార్డ్స్, పోలీస్ ప్రమాదాల నివారణపై, వివిధ శాఖల జిల్లా అధికారులు సమగ్ర కార్యచరణ ను వివరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్ డి ఓ రమాదేవి, తాసిల్దార్లు , ఎంపీడీవోలు వివిధ శాఖల జిల్లా అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేర నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం.

-పెండింగ్ కేసుల త్వరిత పరిష్కారానికి ఆదేశాలు.
-నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మెదక్ ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు ఐపీఎస్.



**మెదక్ జిల్లా -02మే (మహాప్రభ )**
నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు అత్యంత కీలకమని మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పేర్కొన్నారు. శనివారం నార్సింగి పోలీస్ స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న కేసుల వివరాలు, పెండింగ్ కేసుల స్థితి, రికార్డులను సమగ్రంగా పరిశీలించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేసి, నిందితులకు చట్టపరంగా శిక్ష పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రౌడీషీటర్లు, కేడీలు, అనుమానితులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రజలు ప్రశాంతంగా జీవించేలా సమగ్ర భద్రత కల్పించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా అధికారులు గ్రామాలను నిరంతరం సందర్శిస్తూ ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని, తెలియని కాల్స్, సందేశాలు, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరితోనూ పంచుకోవద్దని ప్రజలకు తెలియజేయాలని ఆదేశించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడపడం, మైనర్ డ్రైవింగ్ వల్ల కలిగే ప్రమాదాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసి, వ్యాపారులు, ప్రజాప్రతినిధులు, స్థానికుల సహకారంతో మరిన్ని సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని, ఎలాంటి సమస్యలున్నా నేరుగా తనను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎస్ఐ సృజన, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీకి పునాది సేవాదళ్..

**శిక్షణ శిబిరంలో కాంగ్రెస్ నేత హనుమంత రావు**



**ఆమనగల్లు, -02మే (మహాప్రభ )**
కాంగ్రెస్ పార్టీకి పునాది సేవాదళ్ కార్యకర్తలేనని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీ, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ సలహాదారుడు వి.హనుమంత రావు అన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్లో జరుగుతున్న పీసీసీ సేవాదళ్ మూడు రోజుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా సేవాదళ్ కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. 140 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నుదన్నుగా నిలుస్తూ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్తుందని చెప్పారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో, తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంలోనూ సేవాదళ్ చేసిన కృషి మరువలేనిదని గుర్తుచేశారు. నిస్వార్థంగా పని చేసే కార్యకర్తలు పార్టీకి వెన్నెముక లాంటి వారని ప్రశంసించారు. కష్టపడి పనిచేసే సేవాదళ్ కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇవ్వాల్సిన అవసరం ఉందని చెప్పారు. పార్టీ పరంగా కూడా వీరికి సముచిత స్థానం కల్పించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హనుమంత రావు పేర్కొన్నారు. అనంతరం సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి కానుగుల దశరథం కు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సేవాదళ్ అధ్యక్షులతో పాటు పలువురు సీనియర్ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా సేవాదళ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవరకొండ రూరల్ మండలం - ఐకెపి సెంటర్ సందర్శన



**దేవరకొండ మే 02 ( మహాప్రభ )**
శనివారం రూరల్ మండలం లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు శ్రీ నేనావత్ రాము నాయక్ ఆధ్వర్యంలో స్థానిక ఐకెపి సెంటర్‌ను సందర్శించారు ఐకెపి సెంటర్‌లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ముఖ్యంగా పంట కొనుగోలు, చెల్లింపుల ఆలస్యం, సౌకర్యాల లోపం వంటి అంశాలపై రైతులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.
రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. రైతులకు సరైన మద్దతు ధరలు, సకాలంలో చెల్లింపులు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం భారతీయ జనతా పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ మెంబర్ ఉండాల అంజయ్య, బిజెపి దళిత మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఎర్ర బిక్షపతి, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు నేనావత్ దసరు నాయక్, మండల కోశాధికారి కేలవత్ శంకర్ నాయక్, జయరాం నాయక్, కళ్యాణ్ నాయక్, అరుణ్, బిఖ్య , పకీర, బన్నీ యాదవ్ తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భజన మండలి భక్తులకు వాయిద్య పరికరాల బహూకరణ

**శివంపేట, మే 03(మహాప్రభ):**
శివంపేట్ మండలం పిల్లుట్ల గ్రామంలో ఈరోజు భజన మండలి కళాకారులకు తబులాలు, తాళాలు బహూకరించే కార్యక్రమం నిర్వహించారు. బి.జి.ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, బండారి క్రాంతి చేతుల మీదుగా ప్రముఖ సంఘ సేవకులు, మెదక్ జిల్లా అధికార ప్రతినిధి బండారి గంగాధర్ గారు భజన మండలి బృందానికి వాయిద్య పరికరాలు అందజేశారు. ఈ సందర్భంగా బండారి గంగాధర్ గారు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో కళాకారులను ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయ ఆటలు, నృత్యాలు మరియు భక్తి కార్యక్రమాలు నిలిచి ఉంటాయని





తెలిపారు. భజనల ద్వారా భగవంతుని నామస్మరణ ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం తనకు ఎంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. భజన మండలి సభ్యులు, తమ అవసరాన్ని తెలియజేయగానే సహాయం అందించినందుకు గంగాధర్ గారిని శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఆయనకు మరియు వారి కుటుంబ సభ్యులకు భగవంతుని ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పెద్దపులి రవి, జాతీయ మానవ హక్కుల కమిటీ అధ్యక్షులు సంద్ర సుదర్శనం, బుర్ర పోచ గౌడ్, బుర్ర మహేష్ గౌడ్, పిల్లి ఏసాములు, దాసరి బాలయ్య, బండారి గోపి, పిల్లి ఉపేందర్, పంతులు అల్లిపూర్ బాలేష్, పిల్లి కిష్టయ్య, బోను లింగం, పిల్లి నరసింహులు, పిల్లి నరేష్, దాసరి పోచయ్య, పిల్లి బిక్షపతి, రంగప్ప బాలరాజు, కొత్తపల్లి నాగరాజు, దాసరి లింగం తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ నూతన మున్సిపల్ కమిషనర్ ఎం రామ దుర్గారెడ్డి

-ఎమ్మెల్యే తో కమిషనర్ మర్యాదపూర్వకంగా భేటీ



**దేవరకొండ మే 2 ( మహాప్రభ )**
దేవరకొండ మున్సిపల్ నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎం. రామదుర్గా రెడ్డి. ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తో మర్యాదపూర్వక భేటీ. పట్టణ అభివృద్ధి, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే సూచన. మున్సిపాలిటీ నూతన కమిషనర్‌గా నేడు పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎం. రామదుర్గా రెడ్డి శాసనసభ్యులునేనావత్ బాలు నాయక్ ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం... దేవరకొండ పట్టణ ప్రజలకు మెరుగు సేవలు అందించడానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు.

# బెల్ట్ షాపులపై సర్పంచ్ హెచ్చరిక

**మర్రిగూడ,-02మే (మహాప్రభ )**
గ్రామపంచాయతీ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామని సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ గౌడ్ హెచ్చరించారు. మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు గ్రామాలలో శాంతిభద్రతలు కాపాడటంతో పాటు ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ పాలక మండలి తీర్మానం ఆమోదించిందని తెలిపారు. ఆ మేరకు మర్రిగూడ గ్రామపంచాయతీ పరిధిలో అన్ని బెల్ట్ షాపులను నిషేధించామని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి అక్రమంగా మద్యం విక్రయాలు జరిపినట్లు తేలితే గ్రామపంచాయతీ తరపున రూ. 25,000 జరిమానా విధిస్తామని, అదనంగా సంబంధిత శాఖ ద్వారా చట్టపరమైన చర్యలు కూడా తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ కార్యదర్శి యూసుఫ్, ఇతరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్‌లో కుక్కల స్వైరవిహారం





**కరీంనగర్,- 02మే (మహాప్రభ )**
జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సముదాయం ఇప్పుడు వీధి కుక్కల ఆవాసంగా మారింది. ప్రతిరోజూ వందలాది మంది ప్రజలు, అధికారులు వచ్చే ఈ ప్రాంగణంలో కుక్కలు యథేచ్ఛగా తిరుగుతూ, నడిచే దారుల్లోనే నిద్రిస్తున్నాయి. ముఖ్యంగా సర్వే మరియు భూమి రికార్డుల సహాయ సంచాలకుల కార్యాలయ పరిసరాల్లో కుక్కలు తిష్ట వేసి ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ప్రభుత్వ కార్యాలయానికి వచ్చే సామాన్యులు లోపలికి వెళ్లాలంటేనే జంకుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టరేట్ లాంటి అత్యున్నత కార్యాలయంలోనే ఇలాంటి పరిస్థితి నెలకొనడం ప్రజల్లో తీవ్ర అసంతృప్తి కలిగిస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, కుక్కల బెడదను నివారించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజా రాకపోకలు ఎక్కువగా ఉండే కలెక్టరేట్‌లో కుక్కల స్వైరవిహారం ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తోంది.

# మానకొండూర్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శ్రీకారం



**గన్నేరువరం/ తిమ్మాపూర్, -02మే (మహాప్రభ )**
మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ శనివారం ఖాసీంపేట గ్రామంలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్మించిన కిచెన్ షెడ్, వాటర్ ప్లాంట్, సీసీ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. అదే రోజు నర్సింగపూర్ గ్రామంలో 20 లక్షల నిధులతో నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. పోలంపల్లిలో సీసీ రోడ్డు, భక్తాంజనేయ ఆలయం వద్ద బోరు ప్రారంభించి ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపల్లి సాయిరాం గార్డెన్‌లో జరిగిన ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదల దరికే ప్రభుత్వ పథకాలు చేరాలని, సంక్షేమ పథకాల ద్వారా నిరుపేదలకు లబ్ధి చేకూరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని అన్నారు. రైతు రుణమాఫీ, గృహ జ్యోతి కింద ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్లు, విద్య, వైద్యం, గృహ నిర్మాణాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. మానకొండూర్‌లో 50 పడకల ఆసుపత్రి త్వరలో అందుబాటులోకి రానుందని, యాదవులపల్లిలో 200 కోట్లతో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం కొనసాగుతోందని, వ్యవసాయ కళాశాల కూడా మంజూరైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా 37 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ప్రజల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే సత్యనారాయణ స్పష్టం చేశారు.

# కుక్కల దాడితో గొర్రెల పెంపకదారులకు నష్టం



**మానకొండూర్, -02మే (మహాప్రభ )**
మానకొండూర్ మండలం రంగపేట గ్రామంలో జరిగిన కుక్కల దాడిలో 15 గొర్రెలు మృతి చెందగా, మరో ఐదు గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటనతో గొర్రెల పెంపక రైతు తీవ్ర ఆర్థిక నష్టాన్ని ఎదుర్కొన్నారు. అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు గ్రామానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. వర్కింగ్ ప్రెసిడెంట్ సందబోయిన ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ గొర్రెల పెంపకమే జీవనాధారంగా పెట్టుకున్న రైతులు ఇలాంటి దాడుల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి నష్టపరిహారం అందించడంతో పాటు ఇన్సూరెన్స్ పద్ధతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ బబ్బురి కుమార్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఆవుల మల్లేశం యాదవ్, ఉప సర్పంచ్ కొమురయ్య యాదవ్, యాదవ నాయకులు ముక్కెర కొమురయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కుక్కల దాడి రైతుకు తీవ్ర ఆర్థిక నష్టాన్ని మిగిల్చింది.

# శక్తి సదన్ సందర్శించిన సెషన్స్ జడ్జి



**కరీంనగర్, -02మే (మహాప్రభ )**
జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి డి. వెంకటేష్ శనివారం అశోక్‌నగర్‌లోని శక్తి సదన్‌ను సందర్శించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ శక్తి పథకం ద్వారా ప్రకృతి పర్యావరణ సంస్థ నిర్వహిస్తున్న ఈ కేంద్రంలో జరుగుతున్న సేవలు, సౌకర్యాలను ఆయన పరిశీలించారు. బాధిత మహిళలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్శనలో శక్తి సదన్ సూపరింటెండెంట్ ఎ. రమాదేవి, సిబ్బంది వసంత, రజిత, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు. బాధిత మహిళలకు అందిస్తున్న సేవలను జడ్జి సమీక్షించారు.

# నకిలీ విత్తనాల రహిత జిల్లాగా మెదక్ ను తీర్చిదిద్దాలి

వానాకాలం కు సంబంధించి ఎరువులు పురుగు మందులు రైతులకు సరిపడా నిలువలు ఉండాలి.
-మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



**మెదక్ జిల్లా -02మే (మహాప్రభ )**
నకిలీ విత్తనాల రహిత మెదక్ జిల్లా గా తీర్చిదిద్దాలని,నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై టాస్కోర్స్ బృందాల ద్వారా విస్తృత తనిఖీలు షురూ చేసి.పిడి (పిడి ) యాక్ట్ కింద కేసులు నమోదు కఠిన తరం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్. సీడ్ కార్పొరేషన్ల సమన్వయంతో వానాకాలం 2026 లో పర్యవేక్షణ మరియు అమలు కోసం విత్తనాలు మరియు ఎరువుల కన్వర్జెన్స్ సమావేశం జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,ఆర్డీవోలు మెదక్ రమాదేవి, నర్సాపూర్ రామకృష్ణ, డీఎస్పీలు మెదక్ ప్రసన్న కుమార్, తూప్రాన్ నరేందర్ గౌడ్ ఆత్మ ప్రాజెక్ట్ డైరెక్టర్ రుద్ర మూర్తి, సంబంధిత వ్యవసాయ, రెవిన్యూ, పోలీస్ అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాల రహిత జిల్లాగా మెదక్ ను తీర్చిదిద్దాలని మెదక్ జిల్లాలో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందేలా చూడటం , వచ్చే వానాకాలం పంటలకు ఎరువులు పురుగుమందులు రైతులకు బఫర్ స్టాక్ అందుబాటులో ఉండాలని అన్నారు.(స్పూరియస్) విత్తనాల విక్రయాలను పూర్తిగా అరికట్టడం కోసం జిల్లా స్థాయిలో టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించామని తెలిపారు ప్రభుత్వ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాలను అరికట్టడమే లక్ష్యంగా ముందుకు పోతున్నామని, "నకిలీ విత్తనాల రహిత జిల్లా" సాధన దిశగా ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. వ్యవసాయ శాఖ, పోలీసు శాఖ, సీడ్ కార్పొరేషన్లు (టీ ఎస్ ఎస్ డీ సీ /టీ ఎస్ ఎస్ ఓ సి ఏ), రవాణా శాఖల సమన్వయంతో టాస్క్ ఫోర్స్ బృందాలు . జిల్లాలో 01 జిల్లా స్థాయి బృందం, 03డివిజనల్ స్థాయి బృందాలు, 21 మండల స్థాయి బృందాలు పనిచేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ప్రస్తుతం 334 రిటైల్ విత్తన దుకాణాలు, 41 విత్తన ప్రాసెసింగ్ యూనిట్లు, 334 లైసెన్సు కలిగిన విత్తన హోల్డర్లు ఉన్నారని. ముఖ్యంగా పత్తి, వరి పంటలలో నకిలీ విత్తనాల సమస్య ఎక్కువగా ఉన్నందున, సీజన్ మొత్తం కఠిన తనిఖీలు నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు నకిలీ విత్తనాలు అనగా లైసెన్సు లేని సంస్థలు తయారు చేసినవని అనధికారికంగా విక్రయించబడినవి అని సరైన లేబులింగ్ లేని ప్యాకెట్లు, గడువు ముగిసినవి, ఉంటాయని టాస్కోర్స్ తనిఖీలలో సుదీర్ఘ పరిశీలన చేపట్టాలన్నారు. నకిలీ విత్తనాలను విక్రయించే వారిపై పిడి (పిడి ) యాక్ట్ కింద కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. 2026 వానాకాలంలో సుమారు 03 లక్షల 26ఎకరాల్లో సాగు అంచనా వేయగా, దానికి సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు : రైతులకు ఎరువుల కొరత లేకుండా మార్క్ఫెడ్ (యం ఎ ఆర్ కె ఎఫ్ ఇ డి )ద్వారా తగిన నిల్వలను ముందే సిద్ధం చేస్తున్నామన్నారు.
ముఖ్యంగా రైతులు విత్తనాలు కొనేముందు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, లూజ్ విత్తనాలు ఎట్టి పరిస్థితుల్లో కొనవద్దని రైతులకు సూచించారు. టాస్క్ ఫోర్స్ బృందాలు వారి విధులను సక్రమంగా నిర్వహిస్తూ రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించడం లక్ష్యంగా ముందుకు పోలన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ జిల్లా వ్యవసాయ, రెవిన్యూ పోలీస్ యంత్రాంగం టాస్కోర్స్ బృందాలుగా ఏర్పడి నకిలీ విత్తనాలను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలకు వెనుకాడబోమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముందుగా జిల్లా వ్యవసాయ విభాగం టెక్నికల్ సీడ్స్ అధికారిని వందన జిల్లాలో విత్తన చట్టాలు, వాటి అమలు, టాస్కోర్స్ బృందాలు ఏర్పాటు, ఈ అంశాలపై ఈ సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులకు సుదీర్ఘంగా వివరించగా, ఫర్టిలైజర్ వ్యవసాయ అధికారిని. హర్ష ఎరువులు పురుగు మందులపై బఫర్ స్టాక్, అనుమతి లేని కలుపు మందు విక్రయాలు జరగకూడదని నాణ్యమైన ఎరువులు పురుగు మందులు తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సీట్ డెవలప్మెంట్ కార్పొరేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ అకుల్ కుమార్ జైన్, తాసిల్దారులు,వ్యవసాయ శాఖ ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, డీఎస్పీలు, సి.ఐ.లు, ఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# పొద్దు తిరుగుడు గింజలను కొనుగోలు చెయ్యాలని డిమాండ్



**హుస్నాబాద్,-02 మే (మహాప్రభ )**
హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నిల్వ ఉన్న పొద్దు తిరుగుడు గింజలను ప్రభుత్వం తక్షణమే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేసింది. పార్టీ నాయకులు మార్కెట్ యార్డ్ సూపర్వైజర్ సూద్దాల గంగారామ్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ ప్రతినిధి అయిలేని మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సమస్యలను పట్టించుకోవడంలో విఫలమైందని విమర్శించారు. యార్డ్‌లో దాదాపు 70 క్వింటాళ్లకు పైగా గింజలు నెల రోజులుగా కొనుగోలు లేకుండా నిల్వ ఉన్నాయని, దీనివల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నియోజకవర్గానికి మంత్రి ఉన్నప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గింజలను కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతులను ఇబ్బందులకు గురి చేస్తే బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బండి రమణ రెడ్డి, యాస శ్రీనివాస్, అయిలేని గాల్ రెడ్డి, దొంతబోయిన శ్రీనివాస్, కందుకూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# 6 ఏళ్ల కోటగిరి వర్ణిక నందన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం




**కరీంనగర్, -02మే (మహాప్రభ )**
కరీంనగర్ జిల్లా జ్యోతినగర్‌కు చెందిన 6 ఏళ్ల కోటగిరి వర్ణిక నందన ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించి అరుదైన ప్రతిభను చాటుకుంది. హైదరాబాద్‌లో నివసిస్తున్న వర్ణిక కేవలం ఆరు నిమిషాల్లో పిరమిన్క్స్, 2ఇ2, 3ఇ3, స్క్యూబ్, బ్యారెల్ క్యూబ్‌లను సాల్వ్ చేస్తూ, అదే సమయంలో గాయత్రి మంత్రాన్ని 53 సార్లు జపించడం ద్వారా ఈ ఘనత సాధించింది. తల్లిదండ్రులు హరి కృష్ణ, సింధుజ నిరంతరం ప్రోత్సహించడంతో పాటు క్రమశిక్షణతో సాధన చేయడానికి మార్గనిర్దేశం చేశారు. కుటుంబ సభ్యుల సహకారం ఈ విజయానికి కీలకమని వారు తెలిపారు.వర్ణిక విజయంపై కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభతో వర్ణిక ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం గర్వకారణంగా నిలిచింది.

# శివంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతు కుటుంబం నిరసన



**శివంపేట మే 2 (మహాప్రభ):**
శివంపేట తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఒక రైతు కుటుంబం తీవ్ర నిరసనకు దిగింది. తమ సమస్య పరిష్కారం అయ్యే వరకు కార్యాలయం ఎదుట నేలపై పడుకొని ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. శివంపేట మండలం భిక్య తాండ కు చెందిన రైతు తేజావత్ భద్రియ 2020లో మరణించారు. ఆయన పేరుపై ఉన్న 2 ఎకరాల 38 గుంటల భూమిని అక్రమంగా బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకుడు కల్లూరి హనుమంతరావు తన పేరుపై పట్టా చేయించుకున్నారని భద్రియ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనంతరం ఆ భూమిని హైదరాబాద్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారికి విక్రయించి లాభం పొందినట్లు తెలిపారు. భద్రియ కుమారులు మాట్లాడుతూ---తమ తండ్రి పేరుపై ఉన్న పట్టాభూమిని అప్పటి అధికారులు లంచాలకు లోనై మరొకరి పేరుకు మార్చారని ఆరోపించారు. సమస్య పరిష్కారం కోసం ఏళ్ల తరబడి తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల చుట్టూ తిరిగినా న్యాయం జరగలేదని వాపోయారు. 'అధికారులను వేల సార్లు కలిశాం. ప్రతి సారి 'సరిచేస్తాం' అని చెప్పి మమ్మల్ని మోసం చేశారు. మా భూమిని తిరిగి ఇవ్వాలి, అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి" అని వారు డిమాండ్ చేశారు. సర్వే నెంబర్ 315/37/2లో ఉన్న తమ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని, తాము న్యాయం పొందే వరకు నిరసన కొనసాగిస్తామని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు.

# హనుమాన్ దేవాలయంలో బోర్ వెల్ ఏర్పాటు



**కరీంనగర్ రూరల్, -02మే (మహాప్రభ )**
బొమ్మకల్ 6వ డివిజన్‌లో మహిళా సంఘం భవనం వద్ద నూతనంగా నిర్మించిన హనుమాన్ దేవాలయంలో భక్తుల సౌకర్యార్థం బోర్ వెల్ ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ మేకల వెంకటేష్ ఆధ్వర్యంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఎంపీ నిధులతో ఈ పనులు చేపట్టగా, మేకల వెంకటేష్ కొబ్బరికాయ కొట్టి బోర్ వెల్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు, రైల్వే బోర్డు సభ్యులు పాశం తిరుపతి, రాష్ట్ర నాయకులు చిందం అశోక్, జిల్లా నాయకులు కాల్వ రామచంద్రం, పుట్టపాక శ్రీధర్, గాలిపెల్లి నారాయణ, గాలిపెల్లి వెంకన్న, గాలిపెల్లి లక్ష్మణ్, పోగుల సాయిచంద్, కాల్వ శ్రీకాంత్, నేరెళ్ల శశి, గన్ను మణిదీప్, కామ్రెడ్డి ప్రేమ్ కుమార్, గాలిపెల్లి శంకర్, ఆలయ కమిటీ సభ్యులు, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ బోర్ వెల్ స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

# బిజినెస్

## బీమాలోకి 100 % ఎఫ్‌డిఐ

**నోటిఫై చేసిన కేంద్రం**

**దేశీయ సంస్థల ఉనికికి ముప్పు**

**న్యూఢిల్లీ**



భారత బీమా రంగాన్ని విదేశీ కార్పొరేట్ కంపెనీల చేతిలో పెట్టడానికి మోడీ సర్కార్ తుది నిర్ణయం తీసుకుంది. దేశీయ బీమా కంపెనీల్లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (ఎఫ్‌డిఐ) అనుమతిస్తూ ఆర్థిక మంత్రిత్వ శాఖ శనివారం నోటిఫై చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఈ రంగంలో ఉన్న 74 శాతం పరిమితిని ఎత్తివేస్తూ.. విదేశీ ఇన్వెస్టర్లు ఇకపై భారతీయ బీమా సంస్థల్లో పూర్తి స్థాయి యాజమాన్య హక్కులను పొందేందుకు వీలు కల్పించింది. 'సబ్ కా బీమా -- సబ్ కి రక్షా' చట్టం -- 2025 కింద తీసుకువచ్చిన ఈ మార్పులు దేశీయ బీమా మార్కెట్ ముఖచిత్రాన్ని మార్చనున్నాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటున్నాయి.

**చెప్పాపెట్టకుండా కొనెయ్యొచ్చు**

ఆర్థిక శాఖ నూతన నిబంధనల ప్రకారం విదేశీ ఇన్వెస్టర్లు ప్రభుత్వ ముందస్తు అనుమతి అవసరం లేకుండానే ఆటోమేటిక్ రూట్ ద్వారా పెట్టుబడులు పెట్టవచ్చు. బీమా రంగ నియంత్రణ సంస్థ అయిన ఐఆర్‌డిఎఐ పరిశీలన, ఆమోదం తర్వాతే ఈ ప్రక్రియ పూర్తవుతుందని ఆర్థిక శాఖ పేర్కొంటున్నప్పటికీ విదేశీ సంస్థలకు ఇది పెద్ద అడ్డంకి ఏమీ కాదు. బీమా కంపెనీలతో పాటు ఇన్సూరెన్స్ బ్రోకర్లు, రీ-ఇన్సూరెన్స్ ఏజెంట్లు, థర్డ్ పార్టీ అడ్మినిస్ట్రేటర్లు వంటి మధ్యవర్తిత్వ సంస్థలకు కూడా ఈ 100 శాతం వెసులుబాటు వర్తిస్తుంది. దీనివల్ల అంతర్జాతీయ స్థాయిలో పేరున్న బీమా దిగ్గజాలు నేరుగా భారతీయ మార్కెట్లోకి ప్రవేశించే అవకాశం ఏర్పడింది. ప్రయివేటు బీమా రంగంలో పూర్తి స్థాయి విదేశీ పెట్టుబడులకు అవకాశం కల్పించినప్పటికీ ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్‌ఐసి)లో విదేశీ పెట్టుబడుల పరిమితిని కేవలం 20 శాతానికే పరిమితం చేస్తూ ప్రత్యేక నిబంధనను కొనసాగిస్తోంది. ఇతర బీమా కంపెనీలకు వర్తించే 100 శాతం ఎఫ్‌డిఐ నిబంధన ఎల్‌ఐసికి వర్తించదని పేర్కొంది.

## పెరిగిన వెండి, బంగారం ధరలు

పసిడి ప్రియులకు ఊరట కలిగించేలా శుక్రవారం బంగారం ధరలు తగ్గిన సంగతి తెలిసిందే. శుక్రవారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,50,600 రూపాయల వద్ద.. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,38,050 రూపాయల వద్ద..10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,12,950 రూపాయల వద్ద ట్రేడ్ అయింది.

శనివారం బంగారం ధరలు పెరిగాయి. 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారంపై 330 రూపాయలు.. 22 క్యారెట్ల బంగారంపై 300 రూపాయలు.. 18 క్యారెట్ల బంగారంపై 250 రూపాయలు పెరిగింది.

గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ మార్కెట్‌లో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 1,50,930 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,38,350 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,13,200 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

**వెండి ధరలు..**



బంగారం ధరలతో సంబంధం లేకుండా వెండి ధరలు పెరుగుతూపోతున్నాయి. నిన్న 100 గ్రాముల వెండి 25,500 రూపాయల వద్ద.. కేజీ వెండి 2,55,000 రూపాయల వద్ద ట్రేడ్ అయింది. ఈ రోజు వెండి ధరలు పెరిగాయి. 100 గ్రాములపై 1000 రూపాయలు పెరిగింది. కేజీపై 10 వేల రూపాయలు పెరిగింది. ఉదయం 10 గంటల ప్రాంతంలో హైదరాబాద్ మార్కెట్‌లో 100 గ్రాముల వెండి 26,500 రూపాయల వద్ద.. కేజీ వెండి 2,65,000 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది.

**ప్రముఖ నగరాల్లో 24 క్యారెట్ల బంగారం ధర ఇలా ( 10 గ్రాములు)**

హైదరాబాద్: రూ. 1,50,930
విజయవాడ: రూ. 1,50,930
విశాఖపట్నం: రూ. 1,50,930
ముంబై: రూ. 1,50,930
బెంగళూరు: రూ. 1,50,930
ఢిల్లీ: రూ. 1,51,230
చెన్నై: రూ. 1,52,730
సూరత్: రూ. 1,51,230
మధురై: రూ. 1,52,730
కోయంబత్తూరు: రూ. 1,52,730

## కాగ్నిజెంట్‌లో 4000 మంది ఉద్యోగులపై వేటు.

బెంగళూరు ప్రముఖ టెక్ దిగ్గజం కాగ్నిజెంట్ సంస్థ అంతర్జాతీయంగా వేలాది ఉద్యోగులకు ఉద్వాసన పలికే పనిలో ఉందని తెలుస్తోంది. సంస్థ అంతర్గత పునర్వ్యవస్థీకరణలో భాగంగా సుమారు 4,000 మంది లేదా దాదాపు 1 శాతం సిబ్బంది ఉద్యోగులను తొలగించడానికి కసరత్తు చేస్తుందని రిపోర్టులు వస్తోన్నాయి. కృత్రిమ మేధ (ఎఐ) వినియోగాన్ని పెంచడం, నిర్వహణ ఖర్చులను తగ్గించుకోవడమే లక్ష్యంగా ప్రాజెక్ట్ లీప్ అనే ప్రోగ్రామ్ ద్వారా ఈ మార్పులు చేపడుతోంది. అనుభవజ్ఞులైన వారిపైనే ఎక్కువ వేటు పడుతోందని తెలుస్తోంది. ఎఐ, ఆటోమేషన్ ప్రభావంతో ఐటి రంగంలో వస్తున్న పెను మార్పులే ఈ లేఆఫ్స్‌కు ప్రధాన కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. సిఇఒ రవికుమార్ సారథ్యంలో ఇది రెండో విడత ఉద్యోగాల కోత కాగా.. కంపెనీ తన




శ్రమశక్తిని తక్కువ వేతనం ఉండే ఫ్రెషర్స్ ప్రతిభ వైపు మళ్లిస్తోంది. కేవలం ఖర్చుల నియంత్రణే కాకుండా.. సాంప్రదాయ పద్ధతుల కంటే ఆటోమేటెడ్ వ్యవస్థలపై ఆధారపడటం ద్వారా ఆర్థికంగా 300 మిలియన్ డాలర్ల (దాదాపు రూ. 2850 కోట్ల)మేర ఆదా చేయాలని కాగ్నిజెంట్ లక్ష్యంగా పెట్టుకుంది.

# స్పోర్ట్స్

## బ్యాట్‌తో కుల్దీప్ ముఖంపై కొట్టబోయిన జడేజా..



ఐపీఎల్ 2026లో భాగంగా నిన్న రాజస్థాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆసక్తికర సంఘటన జరిగింది. రాజస్థాన్ టీమ్‌కు చెందిన రవీంద్ర జడేజా, ఢిల్లీ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ మధ్య ఈ ఘటన జరిగింది. అయితే వీరిద్దరూ కొట్టుకునే స్థాయికి వెళ్లారని చూపరులకు కనిపిస్తుంది. కానీ, అక్కడ జరిగింది అందుకు పూర్తి విరుద్ధం. రాజస్థాన్ రాయల్స్ జట్టు బ్యాటింగ్ చేస్తున్న క్రమంలో ధ్రువ్ జూరెల్ అవుటైన తర్వాత 12వ ఓవర్‌లో జడేజా బ్యాటింగ్‌కు వచ్చాడు. అదే సమయంలో ఈ విచిత్ర సంఘటన జరిగింది. రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్‌లు ఒకరినొకరు సరదాగా ఆటపట్టించుకోవడం కనిపించింది. ఇప్పుడు అందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. కుల్దీప్ తన వైపు రావడం గమనించిన జడేజా, తన టీమ్‌ఇండియా పార్ట్‌నర్‌ను భయపెట్టాలనే ఉద్దేశంతో వ్యూహాత్మకంగా బ్యాట్ ఝుళిపించాడు. అయితే, కుల్దీప్ ఏమాత్రం చలించకుండా, జడేజా భుజాలపై చేతులు వేసి తేలికగా నెట్టాడు. జడేజా తన బ్యాట్‌ను అంపైర్‌తో తనిఖీ చేయించుకోబోతుండగా, కుల్దీప్ అతడిని పట్టుకుని మళ్లీ నెట్టాడు. వారి మధ్య జరిగిన ఈ సరదా వాగ్వాదం సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఇదిలా ఉండగా.. ఈ మ్యాచ్ ద్వారా ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు వరుసగా మూడు ఓటముల పరంపరకు ముగింపు పలికి, ఐపీఎల్‌లో తమ అత్యధిక విజయవంతమైన ఛేజింగ్‌ను పూర్తి చేసింది. జైపూర్‌లో 226 పరుగుల లక్ష్యాన్ని ఛేదిస్తున్న క్రమంలో, ఓపెనర్లు కేఎల్ రాహుల్, పతుమ్ నిస్సంకల అర్ధశతకాలు చెలరేగిన వేళ రాజస్థాన్ రాయల్స్ జట్టుపై ఢిల్లీ ఘనవిజయం సాధించింది. పతుమ్ నిస్సంక 33 బంతుల్లో 62 పరుగులతో ఛేజింగ్‌లో రాజస్థాన్ జట్టుపై అద్భుతమైన ఆరంభాన్ని అందించగా, కేఎల్ రాహుల్ 40 బంతుల్లో 75 పరుగులు చేసి ఢిల్లీని విజయానికి చేరువ చేశాడు. నిస్సంకతో కలిసి 110 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం నెలకొల్పిన సమయంలో రాహుల్ అతనికి సహకరించినప్పటికీ, నిస్సంక అవుటైన తర్వాత డీసీ ఇన్నింగ్స్‌కు ఎంతో అవసరమైన ఊపునిచ్చాడు. చివరికి, నితీష్ రాణా (33), అశుతోష్ శర్మ (25లి), ట్రిస్టన్ స్టబ్స్ (18లి) అందించిన విలువైన ఇన్నింగ్స్‌తో రాణించారు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన రాజస్థాన్ రాయల్స్ జట్టు కెప్టెన్ రియాన్ పరాగ్ 50 బంతుల్లో 90 పరుగులు చేసి ఫామ్‌లోకి తిరిగి వచ్చాడు. ఇది ఈ సీజన్‌లో అతని మొదటి యాభైకి పైగా స్కోరు. అదే సమయంలో, డోనోవన్ ఫెరీరా 14 బంతుల్లో 47 నాటౌట్ పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడటంతో, బ్యాటింగ్ ఎంచుకున్న == జట్టు 225/6 అనే బలమైన స్కోరును నమోదు చేసింది. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 'వేపింగ్' చేస్తూ పట్టుబడి జరిమానాకు గురైన పరాగ్, తొలి రెండు ఓవర్లలోనే యశస్వి జైస్వాల్ (6), వైభవ్ సూర్యవంశీ (4) అవుటైన తర్వాత, ధ్రువ్ జురెల్ (42)తో కలిసి ఇన్నింగ్స్‌ను పటిష్టం చేశాడు.

## వైభవ్ సూర్యవంశీని ఐపీఎల్ నుంచి తొలగించాలి

**ఐపీఎల్ నుంచి తొలగించాలని ఓ యాక్టివిస్ట్ డిమాండ్**

రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీని వెంటనే ఐపీఎల్ నుంచి తొలగించాలని ఓ యాక్టివిస్ట్ డిమాండ్ చేశాడు. లేకపోతే రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యంపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించాడు. 15 ఏళ్ల పిల్లాడు ప్రొఫెషనల్ క్రికెట్ ఆడకూడదని, ఇలా చేయడం చైల్డ్ లేబర్ కిందకు వస్తుందని పేర్కొన్నాడు. వైభవ్ సూర్యవంశీ క్రికెట్‌ను పక్కనపెట్టి చదవుకోవాలని హితవు పలికాడు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. అయితే 12 ఏళ్ల వయసు నుంచే వైభవ్ సూర్యవంశీ ప్రొఫెషనల్ క్రికెట్ ఆడుతున్నాడు. బిహార్ తరఫున 12 ఏళ్ల వయసులోనే దేశవాళీ క్రికెట్‌లోకి అరంగేట్రం చేసి ఈ ఘనత సాధించిన అతిపిన్న వయస్కుడిగా వరల్డ్ రికార్డ్ నమోదు చేశాడు. ఆ తర్వాత భారత అండర్ 19 జట్టుకు ఎంపికైన వైభవ్.. ఆసియా రైజింగ్ స్టార్స్ టోర్నీలో కూడా బరిలోకి దిగాడు. అండర్ 19



ప్రపంచకప్ ఆడి భారత విజయంలో కీలక పాత్ర పోషించాడు. 14 ఏళ్ల వయసులో ఐపీఎల్‌లోకి అరంగేట్రం చేయడంతో పాటు 35 బంతుల్లోనే సెంచరీబాది ఈ ఘనతను అందుకున్న పిన్న వయస్కుడిగా చరిత్రకెక్కాడు. ఇటీవలే 15వ జన్మదినం జరుపుకున్న వైభవ్ సూర్యవంశీ.. ఐపీఎల్ 2026 సీజన్‌లో దుమ్మురేపుతున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్‌పై 36 బంతుల్లోనే సెంచరీ బాదాడు. 10 మ్యాచ్‌ల్లో 404 పరుగులు చేసి అత్యధిక పరుగుల బ్యాటర్ల జాబితాలో టాప్ 4లో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ టాక్ ఆఫ్ ది నేషన్‌గా మారాడు. అతను ఆడినా.. విఫలమైనా దేశం మొత్తం చర్చించుకుంటున్నారు. ఐకాన్ ప్లేయర్‌గా ఎదిగిన వైభవ్ సూర్యవంశీపై కన్నడ టీవీ ప్రోగ్రామ్‌లో యాక్టివిస్ట్‌గా పరిచయం చేసుకున్న వ్యక్తి సంచలన వ్యాఖ్యలు చేశాడు. వైభవ్‌ను ఐపీఎల్ నుంచి తొలగించి స్కూల్‌కు పంపాలని డిమాండ్ చేశాడు. లేదంటే లేబర్ చైల్డ్ యాక్ట్ కింద వేస్తానని హెచ్చరించాడు. భారత బాల కార్మిక నిరోధక సవర్ణ చట్టం 2016 ప్రకారం.. 14 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్న పిల్లలతో పని చేయించకూడదు. అయితే సాధారణంగా బాల క్రీడాకారులను చైల్డ్ లేబర్‌గా పరిగణించరు. వారి ప్రతిభను ప్రోత్సహిస్తారు. క్రికెట్ ఒక్కటే కాదు ఇతర క్రీడల్లోనూ 10 ఏళ్ల వయసులోనే ఆడటం మొదలు పెడుతారు. వైభవ్ సూర్యవంశీ ప్రతిభను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. ప్రధాన్ మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్‌తో సత్కరించింది. కాబట్టి సెన్సేషన్ కోసం సదరు యాక్టివిస్ట్ ఈ వ్యాఖ్యలు చేశాడని నెటిజన్లు కొట్టిపారేస్తున్నారు

## రెండు రోజుల్లో ప్లే ఆఫ్స్ షెడ్యూల్.. వేదికలు ఇవేనా..!



పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ షెడ్యూల్‌పై బీసీసీఐ కసరత్తు చేస్తోంది. లీగ్ దశ మ్యాచ్‌లు సగంపైగా పూర్తైనందున నాకౌట్ పోరాటాలకు వేదికలను నిర్ణయించే పనిలో నిమగ్నమయ్యారు అధికారులు. ఇదే అంశంపై శనివారం బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా (ఐవజయఊ ఝఱఆఱ) మాట్లాడుతూ రెండు మూడు రోజుల్లో ప్లే ఆఫ్స్ వేదికలను ఖరారు చేస్తామని వెల్లడించాడు. భారీ స్కోర్ల మ్యాచ్‌లు, ఉత్కంఠ పోరాటాలతో అభిమానులను అలరిస్తున్న లీగ్ దశ ముగియక ముందే ప్లే ఆఫ్స్ షెడ్యూల్ రానుంది. మమే ఆఖరున ఫైనల్ మ్యాచ్ ఉన్నందున.. ప్లే ఆఫ్స్ వేదికలు, షెడ్యూల్‌పై బీసీసీఐ దృష్టి సారించింది. మహిళల పొట్టి ప్రపంచకప్ స్క్వాడ్ ప్రకటించిన సందర్భంగా సైకియా మీడియాతో మాట్లాడుతూ ప్లే ఆఫ్స్ షెడ్యూల్‌పై హింట్ ఇచ్చాడు. 'ఐపీఎల్ ప్లే ఆఫ్స్, ఫైనల్‌కు అనువైన వేదికలపై మేము దృష్టి పెట్టాం. రాబోయే రెండు రోజుల్లో ప్లే ఆఫ్స్‌పై ప్రకటన చేస్తాం' అని సెక్రటరీ దేవజిత్ సైకియా తెలిపాడు.

గత సీజన్ ఫైనల్ ఆడిన ఆర్సీబీ, పంజాబ్ కింగ్స్ సొంత మైదానాల్లో ప్లే ఆఫ్స్ మ్యాచ్‌లు ఉంటాయా? అనే ప్రశ్నకు బదులిచ్చేందుకు సైకియా నిరాకరించాడు. 'మీరు తోచినట్టు ఊహిస్తూనే ఉండండి. కానీ, నేను మాత్రం బదులివ్వను. రెండు రోజుల్లో ప్లే ఆఫ్స్ వేదికలపై నిర్ణయం తీసుకుంటాం' అని సైకియా పేర్కొన్నాడు.

**మే 26న క్వాలిఫయర్ 1**

తొలుత ప్రకటించిన తేదీల ప్రకారం మే 31తో పంతొమ్మిదో సీజన్ ముగియనుంది. దాంతో, మే 26న క్వాలిఫయర్ 1, మే 27వ తేదీన ఎలిమినేటర్, మే 29న క్వాలిఫయర్ 2 మ్యాచ్‌లు నిర్వహించే అవకాశముంది. ముందుగా నిర్ణయించిన మే 31న టైటిల్ పోరు జరుగనుంది.పద్దెనిమిదో సీజన్‌లో హైదరాబాద్ వేదికగా జరగాల్సిన క్వాలిఫయర్ 1, ఎలిమినేటర్‌కు ముల్లన్‌పూర్ వేదికైంది. ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాల నేపథ్యంలో ఆటగాళ్ల భద్రత దృష్ట్యా కోల్‌కతాలో ఆడించాల్సిన క్వాలిఫయర్ 2, ఫైనల్ మ్యాచ్‌లను అహ్మదాబాద్‌కు తరలించిన విషయం తెలిసిందే.


# ఆకట్టుకుంటున్న 'సతీ లీలావతి' ట్రైలర్

మెగా కోడలు లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'సతీ లీలావతి' ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. చాలా కాలం తర్వాత లావణ్య లీడ్ రోల్‌లో కనిపిస్తున్న ఈ చిత్రానికి 'భీమిలీ కబడ్డీ జట్టు', 'హామీ' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వం వహించారు. 'శాకుంతలం' ఫేమ్ మలయాళ నటుడు దేవ్ మోహన్ ఇందులో హీరోగా నటించగా, భార్యాభర్తల మధ్య జరిగే సరదా గొడవలు, ఎమోషన్స్‌ను మేళవించి ఒక పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా దీనిని తెరకెక్కించారు. ఈ సినిమాను మే 8, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ ముహూర్తం ఖరారు చేసింది. ఈ సందర్భంగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. సీనియర్ నరేష్, సప్తగిరి, వీటీవీ గణేష్ కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జే మేయర్ సంగీతం అందించారు.




# జూన్ 26న లెనిన్ విడుదల

'ఏజెంట్'వంటి డిజాస్టర్ తర్వాత 'లెనిన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధమయ్యాడు అఖిల్ అక్కినేని. ఇటీవల ఈ చిత్రం గురించి కింగ్ నాగార్జున పాజిటివ్‌గా స్పందించడంతో.. అక్కినేని అభిమానుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాపై టాలీవుడ్ వర్గాల్లో ఇప్పటికే మంచి అంచనాలు ఉన్నాయి. ఇది అఖిల్ కెరీర్‌ను మలుపు తిప్పే చిత్రమవుతుందని అభిమానులు గట్టిగా నమ్ముతున్నారు. అయితే లెనిన్ సినిమా విడుదల తేదీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఇప్పుడు తెరపడింది. లెనిన్ వాయిదా పడుతందనే వార్తలు వచ్చినప్పటికీ.. తాజాగా పరిస్థితులు అనుకూలించాయి. రామ్ చరణ్ 'పెద్ది' సినిమాను జూన్ 4న విడుదల చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించడంతో ఎలాంటి పోటీ లేకుండా జూన్ 26న 'లెనిన్' సోలోగా బాక్సాఫీస్ వద్ద సందడి చేసేందుకు మార్గం సుగమమైంది. ఇతర పెద్ద సినిమాల పోటీ లేకపోవడం లెనిన్‌కు పెద్ద ప్లస్ పాయింట్‌గా మారుతుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.






## హాట్ లుక్స్‌తో ఫిదా చేస్తున్న శ్రద్ధాదాస్






# అందుకే నాకు పెద్దగా ఆఫర్స్ రాలేదు..


## షాకింగ్ విషయం చెప్పిన హీరోయిన్ సదా

నటి సదా తన ఇన్నేళ్ల ఏళ్ల సినీ ప్రయాణం, వ్యక్తిగత జీవితం,అలాగే చిత్ర పరిశ్రమలో ఎదురైన సవాళ్ళ గురించి ఒక ఇంటర్వ్యూలో ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నారు. తన కెరీర్‌లో జయం, అపరిచితుడు, అన్నదమ్ములు వంటి అనేక విజయవంతమైన చిత్రాలలో నటించినప్పటికీ, తన ప్రతిభకు తగిన గుర్తింపు లభించలేదని అభిమానులు భావించడంపై ఆమె స్పందించారు. ఈ ప్రశ్న తనను కూడా తరచుగా వేధిస్తుందని, దీనికి సమాధానం దొరకలేదని, కొన్ని విషయాలు మన నియంత్రణకు అతీతంగా ఉంటాయని సదా అన్నారు.జయం వంటి భారీ విజయం తర్వాత కూడా ఆఫర్లు రావడంలో జాప్యం జరిగిందని ఆమె గుర్తు చేసుకున్నారు. ముంబైలో నివసించడం, పరిశ్రమలో గాడ్‌ఫాదర్ లేకపోవడం, అప్పట్లో సోషల్ మీడియా అందుబాటులో లేకపోవడం వంటివి దీనికి కారణాలని సదా చెప్పుకొచ్చింది. జయం తనకు చాలా పెద్ద అదృష్టమని, దర్శకుడు తేజ తనను చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడం గొప్ప విషయమని ఆమె పేర్కొన్నారు.అయితే, సినిమా నేపథ్యంలో లేని కారణంగా, నటన వృత్తి ఎంతవరకు నిలబడుతుందో అనే అనుమానంతో జయం తర్వాత తాను తిరిగి తన ఐటీ చదువును కొనసాగించానని సదా తెలిపారు. కొన్ని నెలలు విరామం తీసుకొని చదువుపై దృష్టి సారించానని, నటన ఒక్కటే ఆధారపడదగినది కాదని అప్పట్లో భావించానని చెప్పారు. జయం, అపరిచితుడు చిత్రాలు ఎంత పెద్ద విజయాలు సాధించాయో అప్పట్లో తనకు పూర్తిగా తెలియదని, ఇప్పుడు ఆ గొప్పదనం అర్థమవుతోందని అన్నారు.డాన్స్ షోలో మూడు సంవత్సరాలు జడ్జిగా వ్యవహరించిన తర్వాత, పునరావృతం అనిపించడంతో విరామం తీసుకున్నానని, ప్రస్తుతం తాను తిరిగి ఎప్పుడు వస్తానో చెప్పలేనని అన్నారు. ఇటీవల రా రా అను పాటను నితిన్ సినిమాలో రీమేక్ చేయడంపై సదా స్పందించారు. ఆ పాట రీమేక్ చాలా బాగుందని, మంచి ఫ్లేవర్ ఇచ్చారని ప్రశంసించారు. అయితే, ఆ పాట కోసం తనను సంప్రదించారని వచ్చిన వార్తలను ఖండించారు. తనను ఎవరూ సంప్రదించలేదని తెలిపారు. చాలా ప్రాజెక్టులు తన వరకు రాకుండా మధ్యలోనే ఆగిపోవడం తనకు ఆశ్చర్యం కలిగిస్తుందని, తన నెంబర్ చాలా మందికి అందుబాటులో ఉన్నప్పటికీ ఇలా జరుగుతుందని ఆమె అన్నారు. రెండు మూడు సంవత్సరాలు సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, తిరిగి వచ్చినప్పుడు ప్రేక్షకులు తనను అదే ప్రేమతో ఆదరిస్తున్నారని సదా సంతోషం వ్యక్తం చేశారు. జయం చిత్రం ఇచ్చిన గుర్తింపు, ఆ చిత్రంలోని వెళ్ళవయ్యా వెళ్ళు డైలాగ్ పట్ల ప్రేక్షకుల అభిమానం తనకు ఎంతో ప్రత్యేకమైనవని ఆమె స్పష్టం చేశారు.

# ఆకట్టుకుంటున్న 'సింగ్ గీతం' టీజర్!

భారతీయ సినీ చరిత్రలో అద్భుత ప్రయోగాలు చేసిన దిగ్గజ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు, 94 ఏళ్ల వయసులో మళ్ళీ మెగాఫోన్ పట్టి సరికొత్త మ్యాజిక్ చేసేందుకు సిద్ధమయ్యారు. ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా కీలక పాత్రలో నటించిన చిత్రం 'సింగ్ గీతం'. ఈ సినిమా టీజర్‌ను తాజాగా చిత్ర యూనిట్ విడుదల చేసింది. 'కల్కి 2898 ఏడీ' దర్శకుడు నాగ్ అశ్విన్ ఈ చిత్రానికి సమర్పకుడిగా వ్యవహరిస్తుండటం విశేషం. టీజర్ చూస్తుంటే ఒక వైవిధ్యమైన కథాంశంతో, సంగీత ప్రాధాన్యత ఉన్న చిత్రంగా ఇది కనిపిస్తోంది. స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ దేవి శ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి అద్భుతమైన నేపథ్య సంగీతాన్ని అందించారు. జూన్ 11వ తేదీన ఈ సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ వయసులో కూడా ఆయనలోని ఉత్సాహం చూసి సినీ ప్రముఖులు మరియు అభిమానులు ఆశ్చర్యపోతున్నారు.తెలంగాణ టూరిజం ప్యాకేజీలు

# తుంబాడ్-2'లో అలియా?



జానపద హారర్ జోనర్‌లో రూపొందిన 'తుంబాడ్' చిత్రం విమర్శకుల ప్రశంసలు అందుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద కూడా ఘన విజయం సాధించింది. ప్రస్తుతం ఈ చిత్రానికి సీక్వెల్‌ను రూపొందిస్తున్నారు. సోహుమ్‌షా, నవాజుద్దీన్ సిద్ధిఖీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి ఆదేశ్ ప్రసాద్ దర్శకుడు. శాపగ్రస్త దేవత హస్తార్ చుట్టూ అల్లుకున్న పురాణగాథ నేపథ్యంలో సీక్వెల్ కథ సాగుతుందని తెలిసింది.తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలో అగ్ర కథానాయిక అలియాభట్ కీలకమైన అతిథి పాత్రలో నటించనుందని తెలిసింది. తొలి భాగానికి లభించిన ఆదరణతో పాటు సీక్వెల్‌పై నెలకొన్న అంచనాలను దృష్టిలో పెట్టుకొని అలియాభట్ ఈ సినిమాలో భాగం కావడానికి అంగీకరించిందని బాలీవుడ్ టాక్. ఆమె పాత్ర నిడివి తక్కువే అయినా.. కథాగమనంలో ప్రభావవంతంగా ఉంటుందని చెబుతున్నారు. డిసెంబర్ 3న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com